VICTORY

విక్టరీ

మట్టిలో మాణిక్యం

# అంబేద్కర్

(1891 - 1956)



బయోగ్రఫీ సిరీస్



‘అవిలేవు... ఇవిలేవు...’ అంటూ

ఉన్న వాటిని విస్మరించి లేనివాటి గురించి ఆలోచిస్తూ,

తమలో తామే కృంగిపోతూ,

జీవితాన్ని నిరర్థకం చేసుకుంటున్న నేటి యువతకు

అంబేద్కర్ జీవితం ఒక స్ఫూర్తి!

ఏ సౌకర్యమూ లేనిస్థితిలో ఒక్కడే ఒంటరిగా ఎదిగి,

అందరికీ తానున్నానని ధైర్యం చెప్పిన సమతావాది ఆయన!

అంబేద్కర్‌వంటి మహనీయుడిని స్మరించడం,

ఆయన జీవితాన్నీ, ఆయన సాధించిన విజయాలనూ

స్ఫూర్తిగా తీసుకోవడం మనను మనం గౌరవించుకోవడమే!

అంబేద్కర్ కోరుకున్న

కుల మత వర్గ వర్ణ రహిత సమ సమాజ నిర్మాణంలో

మనమూ భాగస్వాములమవుదాం!

మట్టిలో మాణిక్యం - డా॥బి.ఆర్. అంబేద్కర్

ⒸLn. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ : డిశంబర్ 2012

వెల. రూ. **50/-**

**మనవి**

మాచే ప్రచురించడబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించ గలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియ చేసిన తదుపరి ముద్రణలో సరిచేయ గలం. ఏ విషయమైన ఈ క్రింది ఈ మెయిల్‌కు తెలియ జేయవచ్చును.

**ramakumar immadisetty@yahoo.com**

మీకు కావలసిన పుస్తకాలకు

**SBI online A/c. No.**
**31712393082**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
**26-27-77,** బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ - **520 003.**
ఫోన్ : (0866) 2570192, 2570309

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం.**3, 103, 2-4-1085,**
సాయిలక్ష్మి నికేతన్, రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు **-500 027.**
ఫోన్ : (040) 65528228, 24653879
(ఫాక్స్) 24745257, సెల్ : 9346771314

***Published by :*** **శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ.**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

VICTORY

విక్టరీ

# మట్టిలో మాణిక్యం

# డా॥ బి. ఆర్. అంబేద్కర్

✍
మల్లాది కామేశ్వరరావు

సాయి వెంకటేశ్వర బుక్ డిపో
డోర్.నెం.26-27-77, బాటాషోరూమ్ ఎదురు, గాంధీనగర్,
విజయవాడ - 520 003. ఫోన్ : (0866) 2444156



# మా మాస్టారికి...

మనిషిని సృష్టించిన భగవంతుడు
గొప్పవాడో కాదో నేను చెప్పలేనుగానీ...
ఈ లోకంలోకి వచ్చిన రక్తమాంసాల మట్టిముద్దకు
అక్షరజ్ఞానం ప్రసాదించిన ఒకటో తరగతి మాస్టారు
అంతకన్నా గొప్పవాడు...! అందుకే-
అంబావడేకర్‌లో జ్ఞానజ్యోతులు వెలిగించిన
'అంబేద్కర్' గొప్పవాడు...!
ఈ మట్టిముద్దకు నాలుగక్షరాల ఆయుష్షుపోసిన
మా ఒకటో తరగతి **శర్మ** మాస్టారు గొప్పవాడు...!
ఆ మహానుభావుడి నామస్మరణలో
నన్ను నేను పునీతం చేసుకుంటూ...
ఈ 'మాణిక్యాన్ని' భక్తితో ఆయనకు సమర్పిస్తున్నాను.

మాస్టారూ.... ఈ అక్షరదక్షిణ స్వీకరించండి...

\- మల్లాది కామేశ్వరరావు

అంబేద్కర్‌కు
మానసిక ప్రశాంతతను అందించిన
బౌద్ధమత తారక మంత్రం



# బుద్ధం శరణం గచ్ఛామి



# అక్షర నీరాజనం

**ఎవరూ ఓడిపోవాలని కోరుకోరు...!**

**అందరూ గెలవాలనే అనుకుంటారు...!**

**అయితే - గెలవడం ఎలాగో తెలియకే చాలా మంది ఓడిపోతుంటారు...!**

గెలవాలనే కోరిక మీకు ఉంటే గెలిచేందుకు అవసరమైన నైపుణ్యం సాధించేందుకు నిరంతరంగా ప్రయత్నిస్తారు...!

విజయం కోసం - ఒక సారి కాదు, రెండు సార్లు కాదు, విజయం సాధించేంతవరకు అవిశ్రాంతంగా ప్రయత్నిస్తూనే ఉంటారు...!

**విజయం ఏ ఒక్కరి సొత్తూ కాదు...**

**మీ ప్రయత్నమే మిమ్మల్ని విజేతల్ని చేస్తుంది...! రేపటి చరిత్రను సృష్టిస్తుంది...!**

**సరిగ్గా - అదే జరిగింది అంబేద్కర్ విషయంలో...!**

చదువుకునే అవకాశాలూ, ఆర్థికపరమైన వెసులుబాట్లూ, సంఘంలో స్వేచ్ఛావిహారం మనోవిజ్ఞానవికాసం కోసం తగినంత ప్రోత్సాహం – ఇలా అన్నీ ఉన్నా... నేటి యువత అంతంతమాత్రపు ఫలితాలే సాధించడానికి కారణం ప్రయత్నలోపమే! **ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి అడుగడుగునా ఎదురైన అడ్డంకులను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ ముందడుగు వేసిన స్థిరసంకల్పానికి అంబేద్కర్ జీవితంకంటే మంచి ఉదాహరణ వేరే ఉండబోదు.**

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్న నానుడిని నిజంచేస్తూ దట్టంగా పేరుకున్న అవిద్య, అస్పృస్యతా కారుచీకట్లను తరిమికొట్టిన అంబేద్కర్ నిజంగా కారణజన్ముడే...! సదా పూజనీయుడే...! అందుకే – ఈ అక్షర నీరాజనం.

**'జీవితంలో నెగ్గాలన్న పట్టుదల నీకుంటే**
**సాధించలేనిదంటూ ఉండద'ని చెప్పే**
**'మట్టిలో మాణిక్యం అంబేద్కర్' నేటియువతకు నిజమైన స్ఫూర్తి...**
**రేపటి భవితకు మార్గదర్శి.**

**– మల్లాది కామేశ్వరరావు**

కార్తీకం, 2012

# mundumaata



**Ln. I. Ramakumar,** PMJF

ప్రాథమిక పాఠశాల విద్యకే అష్టకష్టాలు పడాల్సిన నిమ్నజాతీయుడిగా పుట్టి, అత్యంత ఏకాగ్రతతో ఉన్నత విద్యావంతుడై ధర్మాధర్మ విచక్షణను జాతికి నేర్పించిన మాననీయుడు మన 'రాజ్యాంగ శిల్పి' అంబేద్కర్...! అంబేద్కర్ గురించి, ఆయన ఆలోచనల గురించి ఇంతవరకూ కొన్ని వేల పుస్తకాలు విడుదల అయ్యాయి. అణగారిన జీవితాలలో మారని జీవన స్థితిగతులను పరిశీలిస్తున్నపుడు... అంబేద్కర్ గురించి వచ్చిన పుస్తకాలు జనసామాన్యంలోకి ఇంకా వెళ్ళలేదేమో అనిపిస్తుంది...!

అంబేద్కర్ జీవితం తెరచిన పుస్తకం...! ఆయన జీవితం నిండా ఉన్నవన్నీ కష్టాలూ, కన్నీళ్ళే...! గరళం మింగిన శివుడిలా బాధలన్నీ తాను భరించి భరత జాతికి బంగారు భవిష్యత్ అందించిన అంబేద్కర్ గురించి నేటి యువతరానికి చక్కని స్ఫూర్తినిచ్చే రచనను ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, మెమొరీ ట్రైనర్, మోటివేటర్ శ్రీ మల్లాది కామేశ్వరరావు అందించారు. ఈ **'మట్టిలో మాణిక్యం'** ఉత్తుంగ గంగా ప్రవాహంలా చదువరులను, ముఖ్యంగా యువతరాన్ని ఉరకలెత్తించి, లక్ష్యసాధన దిశగా ఉత్సాహపరచ గలదనడం అతిశయోక్తి కాదు....! చదివిన తరువాత మీరే అంటారు.... ఇది నిజమని....!

అభినందనలతో...

**ఐ. రామ్‌కుమార్,**

**విక్టరీ పబ్లిషర్స్**



# అభ్యుదయ పథ నిర్దేశకుడు అంబేద్కర్

**కులమతాల వైషమ్యాల మధ్య మనిషికి మనిషిగా బతికే హక్కులేని సమాజంలో అవస్థలనూ, అవమానాలనూ ఎదుర్కొంటూ, స్వయం కృషితో ఆకాశమంత ఎత్తుకు ఎదిగి, మనిషి కోసం... మనిషి విలువకోసం... అవిశ్రాంతంగా పోరాడి 'మనుషులంతా ఒక్కటే!' అని చాటిచెప్పిన మానవతావాది అంబేద్కర్.**

**మతంపేరుతో మనుషులలో అంతస్థులు నిర్మించి, వాటిని తమ స్వప్రయోజనాల కోసం వ్యవ స్థలుగా మార్చిన మతోన్మాదుల దుర్మార్గపు ఎత్తుగడ లను తూర్పారబెట్టి సర్వమానవ సమానత్వాన్ని సహేతుకంగా నిరూపించిన ప్రజాస్వామివాది అంబేద్కర్.**

ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వాల పునాదులపై నిర్మించి మనకు అందించిన 'రాజ్యాంగశిల్పి'. విద్య, ఉద్యోగ రంగాలలో స్త్రీలకు సమాన అవకాశాలు, ప్రతిపాదించిన నిజమైన జాతీయవాది అంబేద్కర్.

అంబేద్కర్ అసలు పేరు భీమారావ్ రాంజీ అంబావడేకర్. 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్ర కొంకణ ప్రాంతంలోని రత్నగిరి జిల్లా అంటవాడ గ్రామంలో రాంజీ, భీమాభాయి దంపతుల 14వ సంతానంగా జన్మించిన అంబావడేకర్ అస్పృశ్యు డుగా, అంటరానివాడిగా ధూషణ భూషణాలతో రోజులు భారంగా గడుపుతూనే తానెన్నుకున్న

బాటలో అంచెలంచెలుగా ప్రయాణం సాగిస్తూ మానవజాతి మహాభ్యుదయానికి... ముఖ్యంగా దళితజాతి దరహాస వికాసానికి అవిశ్రాంతంగా కృషిచేసిన యోధుడు.

**ఒక విద్యార్థి పరిపూర్ణమైన వ్యక్తిగా రూపుదిద్దు కోవాలంటే అందుకు అతను చదువుకున్న చదువే కారణం! అంటే– అతనికి చదువు చెప్పిన గురువే కారణం అన్నమాట!**

అంబావడేకర్ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించే సమయంలో అంబేద్కర్ అనే ఉపాధ్యాయుడు ఉండేవారు. బ్రాహ్మణ కులస్థుడైన ఆయనకు కులమతాల అంతరాలంటే ఇష్టమండేది కాదు. చదువన్నా, చదువుకునే పిల్లలన్నా ఆయనెంతో ఇష్టపడేవారు. అందుకే– చదువులో మేటిగా ఉండే అంబావడేకర్ అంటే ఆయన ప్రత్యేకంగా ఇష్టం చూపే వారు. 'నువ్వు అంటరానివాడివి... అస్పృశ్యుడివి' అంటూ తోటి విద్యార్థులు హేళన చేస్తుంటే– వెర్రితలలు వేస్తున్న హిందూ మతోన్మాదుల దురహం కారానికి ఎదురెళ్ళే సాహసం ఆయన చేయలేకపోయినా... అంబావడేకర్‌పై ప్రత్యేక అభిమానంతో విద్యా విషయక సహాయం అందించేవారు. అందుకే– అంబావడేకర్‌కు తన గురువుగారైన అంబేద్కర్ గారంటే ఎంతో గౌరవం.. అభిమానం... ఇష్టం! ఆ ఇష్టంతోనే– ఎవరైనా తన పేరడిగితే అంబేద్కర్ అంటూ చెప్పేవారు. ఇలా.. కాలక్రమంలో అంబావడేకర్ అంబేద్కర్‌గా ప్రజలకు చేరువయ్యారు. ప్రజల మనిషిగా ప్రజాభ్యుదయ మహాయజ్ఞానికి సారథ్యం వహించారు.

ఆర్థికపరమైన అనేక కష్టాల మధ్య అంబేద్కర్ విద్యాభ్యాసం సాగింది. 1907లో మెట్రిక్, 1912లో బి.ఎ. చదువుతున్న అంబేద్కర్‌కు ఉన్నత విద్యాభ్యాస అవకాశం బరోడా మహారాజు అందించిన ఉపకార వేతనంతో లభించింది. 1913లో అమెరికా వెళ్ళి అక్కడి కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరాడు. 1915లో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. పట్టభద్రుడ య్యాడు. అదే సమయంలో అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర, తత్వశాస్త్రం, మానవశాస్త్రం అభ్యసించాడు. 'భారత జాతీయాదాయం– దాని చారిత్రక విశ్లేషణ' అంశంపై పిహెచ్‌డి చేశాడు. అనంతరం– లండన్‌వెళ్ళి పొలిటికల్ సైన్స్‌లో డి.ఎస్. డిగ్రీలో చేరాడు. అదే సమయంలో న్యాయశాస్త్ర అధ్యయనం కోసం లా కళాశాలలోనూ చేరాడు. ఆర్థిక పరమైన ఒత్తిడితో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో చదువుకు స్వల్పకాల విరామం చెప్పి భారతదేశం తిరిగివచ్చి బరోడా మహారాజు కొలువులో చేరాడు.

ఇలా కొద్దికాలం గడిచిన తర్వాత 1920లో మళ్ళీ లండన్ వెళ్ళి ఆగిపోయిన చదువును కొనసాగించాడు. 1921లో ఎం.ఎస్.సి. పట్టా పొందాడు. అదే సమయంలోనే బారిష్టరు పరీక్షనూ పూర్తిచేశాడు. ఆ తర్వాత జర్మనీ వెళ్ళి తర్కశాస్త్రం, ఆర్థికశాస్త్రం అధ్యయనం చేశాడు.

**ఒకదానితో మరొకటి ఏ విధమైన సంబంధములేని విషయాలను అధ్యయనం చేస్తూ పట్టభద్రుడు కావాలంటే– అందుకు అకుంఠితమైన దీక్షాదక్షతలు, అవిశ్రాంత కృషి, లక్ష్యసాధనపట్ల నమ్మకం కావాలి. అంబేద్కర్‌లో ఇవి పుష్కలంగా ఉన్నాయి.**

ప్రొఫెసర్‌గా, రక్షణశాఖ కార్యదర్శిగా, 'మూక్ నాయక్' వారపత్రిక వ్యవస్థాపక సంపాదకునిగా, న్యాయవాదిగా, రచయితగా రకరకాల మలుపులు తిరిగిన అంబేద్కర్ జీవితంలో మరో మలుపు బొంబాయి రాష్ట్ర శాసనసభ సభ్యునిగా నియామకం. ఈ సమయంలోనే కులమతాల అసమానతల మధ్య దుర్భర జీవనం సాగిస్తున్న నిమ్న జాతుల ఉన్నతికి అవిశ్రాంత కృషి చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించిన అంబేద్కర్ 'స్వాతంత్ర్యం అంటే అధికారం బ్రిటీష్ వారి చేతుల్లోనుండి అగ్రవర్ణాల చేతుల్లోకి మారడం కాదు. అది దేశంలో అన్ని కులాల వారికి, వర్గాలవారికి, మతాలవారికి అనుభవించేదిగా ఉండాలి' అని చెప్పేవారాయన.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న అంబేద్కర్ నిమ్నజాతుల అవసరాలనూ, ఆకాంక్షలనూ లోకానికి చాటి చెప్పారు. నిమ్నజాతుల ప్రజలు ప్రజాజీవితంలో మమేకం కావాలన్న సత్సంకల్పంతో 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థాపించారు.

1947లో భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన కేంద్రమంత్రి వర్గంలో న్యాయశాఖా మంత్రిగా అంబేద్కర్ బాధ్యతలు చేపట్టారు.

1947 ఆగస్ట్ 29న భారత రాజ్యాంగ ముసాయిదా రచనా సంఘం ఏర్పాటయ్యింది. దీనికి అధ్యక్షుడుగా అంబేద్కర్ ఎంపికయ్యారు. ఈ సంఘంలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కె.ఎం.మున్షీ, అయ్యంగార్, ఎన్.గోపాలస్వామి, మహ్మద్ సాధుల్లా, ఎన్.మాధవమీనన్, డి.పి.ఖైతాన్ సభ్యులుగా ఉండగా, బెనిగల్ నర్సింగరావు రాజ్యాంగ సలహాదారుగా వ్యవహరించారు.

1948 జనవరి నాటికి రాజ్యాంగ ముసాయిదా రచన పూర్తయింది. ప్రజాభిప్రాయం కోసం ఈ ముసాయిదా ప్రతులను పత్రికల ద్వారా విడుదల చేశారు. ఎనిమిది నెలలపాటు ప్రజాభిప్రాయం కోసం సమయమిచ్చి, 1948 నవంబర్ 4న చర్చ ప్రారంభించారు. చర్చల అనంతరం రాజ్యాంగ సభ రాజ్యాంగ ముసాయిదా చట్టాన్ని ఆమోదించడంతో 1950 జనవరి 26 నుంచి భారతదేశం సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవిం చింది. 1956 డిసెంబర్ 6వ తేదీ ఉదయం అంబేద్కర్ తన గ్రంథ రచనకు తుదిమెరుగులు దిద్దుతూ... మృతిచెందారు. చిన్నతనంలోనే అంటే 14 సంవత్స రాల వయసులో అంబేద్కర్‌కు రమాబాయితో వివాహమయ్యింది. వీరికి ఇద్దరు సంతానం. అయితే ఆ ఇద్దరూ బాల్యదశలోనే మరణించారు. 1935లో భార్య రమాబాయి మరణించగా– 1948లో డా॥ శారద అనే బ్రాహ్మణ స్త్రీని రెండవ వివాహం చేసుకున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆదర్శ అధ్యాపకునిగా, సునిశిత గ్రంథకర్తగా, విశిష్ట కార్మిక నాయకునిగా, ఉన్నత రాజనీతిజ్ఞునిగా, పీడిత ప్రజల ఆశాజ్యోతిగా, దళితజాతుల వైతాళికునిగా ఆదర్శ ప్రాయమైన జీవనం సాగించిన అంబేద్కర్‌కు 1990 లో భారత ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేసింది.

**కష్టాలూ, కన్నీళ్ళూ, చీదరింపులూ, బెదిరింపులూ. అవమానాలూ, అవహేళనలూ... వంటి అనాచార, అనాగరిక, ఆటవిక సమాజంలోంచి స్వయంకృషితో ఎదిగి, సభ్యసమాజానికి మనిషి విలువ తెలియజెప్పిన మాణిక్యం మన అంబేద్కర్...!**

**అంబేద్కర్ గురించి తెలుసుకోవడమంటే**
**మన గురించి మనం తెలుసుకోవడమే...!**
**మట్టిలో మాణిక్యమైన మన అంబేద్కర్ జీవనచిత్రం**
**ఎలా సాగిందంటే...**

– ఇక చదవండి...



# మట్టిలో మాణిక్యం

**అది మహారాష్ట్రలోని మారుమూల పల్లె!**

**పొద్దు పొడవడం... పొద్దు గుంకడం మినహా**

**ఇతరత్రా మరే విధమైన వ్యాపకం లేని కుగ్రామం అది!**

**అభివృద్ధి అంటే ఏమిటో... ఆదరణ అంటే ఎలా ఉంటుందో...అస్సలు తెలియని అమాయక ప్రపంచమది! వేళ్ళ సంఖ్యలో ఉన్న గడపల్లో ఓ గడప రేపటి చరిత్రకు సువర్ణాక్షరపుటగా మారుతుందని ఎవ్వరికీ తెలియదు! అందుకే - ఆవూరు ఎప్పటిలాగే ఆ రోజు కూడా మామూలుగానే నిద్రబోయింది!**

తెల్లవారింది! తూరుపుకొండల మీద నుంచి తొంగిచూస్తున్న సూర్యుడు తన తొలి వెలుగురేఖల్ని ఆ పల్లెపై వెదజల్లాడు. అవును... ఆగ్రామం ఆరోజున కొత్తగా మెరిసింది! ముసురుకున్న చీకటి తెరలు తొలగిపోతున్న క్షణంలో... కొత్త వెలుగు తెచ్చిన సూర్యుడు ధగధగా మెరిసాడు. ఆ మెరుపు కాషాయవర్ణమై కొత్తగా కనిపించింది! ఆ మొహంలో ఏదో తెలియని కాంతి...! ఆ చూపులో ఏదో తెలియని ఆకర్షణ...! ఆ నడకలో ఏదో తెలియని అన్వేషణ...! అలౌకిక స్థితిలో  అడుగులో అడుగు వేస్తూ

గ్రామంలోకే వస్తున్న ఆ మూర్తిని గమనించిన ప్రతి ఒక్కరూ చేతులెత్తి మొక్కుతున్నారు..! వినయంగా పక్కకు తొలగి దారి ఇస్తున్నారు. అంతలో...

**'బాబా...మీరు...నువ్వు...అంటూ ఓకామె**

**ఆ మూర్తిని గుర్తుపట్టే ప్రయత్నం చేసింది.**

**'నువ్వనుకునేది నిజమే...! నేను నేనే....!'**

**చిర్నవ్వుతో బదులిచ్చిందా మూర్తి!**

'రాంజీ ఇక్కడే ఉన్నాడు... దా...ఇంటికి వెళ్దాం...' పిలిచిందామె! 'వద్దు...నేనిక్కడే ఉంటాను...! రాంజీని భార్యతో సహా ఇక్కడికే రమ్మను..' చెదరని చిర్నవ్వుతో అక్కడే ఉన్న చెట్టు నీడలో సేదతీరేందుకు కూర్చున్నాడు.

ఆమె ఆఘమేఘాలమీద రాంజీ ఇంటికెళ్ళి, మీ బంధువు సాధువై మన ఊరొచ్చాడంటూ చెప్పడం, రాంజీ భార్య భీమాబాయితో సహా అక్కడికి చేరుకోవడం క్షణాల్లో జరిగిపోయింది....! సంసారబంధనాలపై విరక్తి చెంది అప్పుడెప్పుడో ఇల్లొదిలి వెళ్ళిపోయిన పినతండ్రి ఇప్పుడిలా... పూర్ణతేజస్సుతో పరిపూర్ణుడై తిరిగిరావడం రాంజీకి పట్టలేనంత సంతోషం కల్గించింది. ఇంటికిరమ్మంటూ రాంజీ చేసిన విన్నపాన్ని సున్నితంగా తిరస్కరించి, వారి యోగక్షేమాల గురించి ప్రశ్నించాడు.

**పైకి నవ్వుతూ మాట్లాడుతున్నా ఆ నవ్వువెనుక దాగి వున్న అంతులేని ఆవేదనని ఆయన గమనించాడు. కల్మషమెరుగని ఆ పల్లె వాసుల వదనాల్లో గూడుకట్టుకున్న దైన్యాన్ని గ్రహించాడు. భీమాబాయి మొహంలో కొట్టొచ్చినట్టుగా కొలువుదీరిన లక్ష్మీ స్వరూపాన్ని దర్శించాడు.**

**అంతే...**

**అతిత్వరలోనే మీకు పుత్రసంతానం కలుగుతుందనీ,**

**ఆ బిడ్డ జాతిని చైతన్యవంతం చేసే కాంతి దీపమై ప్రకాశిస్తాడనీ,**

**చరిత్రలో చిరస్మరణీయమైన కీర్తిప్రతిష్టల్ని పొందుతాడనీ**

**ఆశీర్వదించాడు...!**

స్వామి వాక్కు ఆ దంపతుల్ని ఆనందపరవశుల్ని చేసింది. స్వామికి కృతజ్ఞతగా శిరసువంచి నమస్కరిస్తూండగా ఆయన నెమ్మదిగా కదలి వెళ్ళాడు. భీమాబాయి మనసు పుట్టేబిడ్డ కోసం తహతహలాడుతున్నంతలోనే ...

**ఆమె కడుపులో ఏదో కదిలినట్లనిపించింది.**

## స్వాగత సంరంభం

**అది 1891,ఏప్రిల్14. మహారాష్ట్ర రత్నగిరి జిల్లాలోని మంజన్‌గడ్‌కు అయిదు కిలో మీటర్ల దూరంలో ఉన్న 'అంబావదే' రోజూలాగే ఆరోజూ కూడా అగ్రవర్ణాల అభిజాత్యానికి తలవొగ్గి నిశ్శబ్ధంగా నిద్రలేచింది.**

తూర్పున సూర్యోదయం రాకతో బాటే రాంజీ ఇంట్లో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి! అప్పటికే పదమూడు మంది చిన్నారులకు ఊపిరిపోసిన భీమాబాయి మరోబిడ్డకు జన్మనివ్వడానికి సిద్ధమయ్యింది! అంతవరకూ వేగంగా వీస్తున్న గాలి వింజామరగా వీస్తూ ఆ తల్లిని నెమ్మదిగా స్పృశించింది. అంతవరకూ పురిటినొప్పులతో విపరీతమైన అలసటకూ ఇబ్బందికీ గురవుతున్న భీమాబాయి ఆ చిరుగాలి వీవెనతో ఆ నొప్పుల్ని మరచిపోయింది. ఈ లోకంలోకి కొత్తగా వస్తున్న చిన్నారికి స్వాగతం పలకడానికా అన్నట్లుగా అరుణోదయ వెలుగురేఖలు ఆ ఇంటిని తాకాయి!

బిడ్డ భూమి మీద కొచ్చాడు.

దూరంగా పక్షులు ఆనందంతో సందడి చేశాయి.

## ఎన్నో అడగాలి...

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా... అమ్మ ఒడిలో నుంచే ఈ లోకాన్ని అధ్యయనం చెయ్యడం ప్రారంభించిన బిడ్డకి తాముంటున్న పరిసరాలు, ఆ పరిసరాలలో ఛస్తూ బతుకుతున్న జీవితాలు... ఆ జీవితాలతో పెనవేసుకుని ఉరితాడులా బిగుసుకున్న అస్పృశ్యతాముద్ర ఆ చిన్నారి మనసుపై ముద్ర పడిపోయింది. వచ్చే పోయే వారికి

వంగొంగి దణ్ణాలు పెడుతూ 'దొరవార్ల' చీదరింపులను చిరునవ్వుతో స్వీకరించి తల వంచుకు పక్కకు తొలగే తనవార్ని చూస్తే... ఏదో తెలియని వెలితి...! తన వారి కళ్ళల్లో మబ్బు తెరలా మెరసి మాయమయ్యే చెమరింపులు... తమ జీవన గాథల చేదు నిజాలన్నీ ఈ చిన్న హృదయానికి చక్కగా వివరించాయి! అంతే...శతథా సహస్రథా... ప్రశ్నలు మొదలయ్యాయి!

**'అమ్మను ఏదో అడగాలి...**
**అమ్మ మాటల్లో అసలు నిజం తెలుసుకోవాలి...'**
**ఆ చిన్నమనసు తహతహలాడింది...!**
**అమ్మను అడిగేందుకు ప్రయత్నిస్తూ ఆ ప్రయత్నంలో భాగంగా**
**అమ్మ ఒడిలోంచి కొద్దిగా కదిలిందా బిడ్డ...!**

ఆ ప్రయత్నంగానే బిడ్డ నోట్లోంచి ప్రశ్న ఏడుపుగా బయటకొచ్చింది..! ఏడుస్తున్న బిడ్డను అక్కువ చేర్చుకున్న తల్లి... బిడ్డకు ఆకలేస్తోందన్న భావనతో పాలుపట్టింది. ఎన్నో అడగాలనుకున్న బిడ్డ... ఎలా అడగాలో తెలియని పసిపాపగా అమ్మపాలు తాగి చీరకొంగు చాటున ఆదమరచి నిద్రపోయింది!

## తొలి గురువు

**అమ్మ ఒడిలో కూర్చుని నాన్ననూ, అన్నయ్యలనూ అక్కయ్యలనూ, ఇరుగుపొరుగు బంధువులనూ ఒక్కొక్కరినే పరిచయంచేసుకుంటూ, పరిసరాలనూ, పరిస్థితులనూ అధ్యయనం చేస్తూ ఎదుగుతున్న బిడ్డకు భీమారావుగా నామకరణం చేశారు.** పధ్నాల్గవ సంతానంగా జన్మించిన భీమారావు తల్లి ఒడిలో కూర్చునే పరిసరాలనూ బంధుమిత్రుల మాటతీరునూ నిశితంగా పరిశీలిస్తూండటం సైనిక క్రమశిక్షణతో పెరిగిన రాంజీని సైతం ఆశ్చర్యపరిచింది. బిడ్డను దగ్గర కూర్చోబెట్టుకుని భారత రామాయణ గాథల్నీ, మహాపురుషుల చరిత్రల్నీ, వీర గాథల్నీ, నీతి కథలనూ, చిన్న చిన్న పదాలతో చెప్పేవాడు. అవి విన్న తర్వాత బిడ్డలో క్రమక్రమంగా కనిపించే చిన్న పాటి మార్పు రాంజీకి సంతృప్తి కలిగించేది! భజన పాటలు, కీర్తనలను తండ్రి చెబుతుంటే ఏడాదిన్నర బిడ్డ వల్లించడం నిజంగా అద్భుతమే!

## సాహసానికి మరోపేరు

సాహసానికీ సమయస్ఫూర్తికీ, వివేకానికీ విషయ విశ్లేషణకూ మరోపేరుగా మహర్లకు పెద్దపేరు! నిమ్న కులాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహర్లు పూర్వకాలంలో మహారాష్ట్ర కొంకణ ప్రాంతానికి చెందినవారు.

**మహర్లలో చరిత్ర గుర్తుంచుకోదగిన వ్యక్తి మాలోజీ సక్ పాల్ మహర్.**

ఈయన వంశీకులు రత్నగిరి జిల్లా మంజన్ ఘడ్‌కు అయిదు కిలో మీటర్ల దూరంలో ఉన్న "అంబావదే" గ్రామంలో అనేక తరాలుగా నివశించేవారు.

**తన వంశంలోనే 'మనుషులందరూ సమానమే... మనిషిని మనిషిగా గుర్తించి గౌరవించాలంటూ నినదించడమే కాకుండా, అందుకోసం సామాజిక చైతన్య జ్వాల రగిలించగల కారణజన్ముడు ఉద్భవిస్తాడని అప్పట్లో ఆయనకు తెలియదు!**

వ్యాపారం నిమిత్తం భారత భూభాగం చేరుకుని, రాజుల అంతర్గత కలహాల కారణంగా రాజ్యాధికారాన్ని కైవశం చేసుకుంటూ క్రమక్రమంగా భరతఖండాన్ని హస్తగతం చేసుకున్న ఈస్టిండియా కంపెనీ ఇక్కడ సైన్యాన్ని ఏర్పాటు చేస్తున్న కాలమది! ధైర్య సాహసాలకూ, బుద్ధి కుశలతకూ, వినయ విధేయతలకూ పెట్టింది పేరైన మహర్లకు సైనిక నియామకాల్లో అధిక ప్రాధాన్యత లభించింది. ఆ క్రమంలో మిలటరీలో చేరిన మాలోజీ సక్‌పాల్ చాలా కాలం పాటు పనిచేసి పదవీవిరమణ చేశారు. ఈయన సంతానంలో బతికి బట్ట కట్టింది కొడుకు రాంజీ, కూతురు మీరా! కబీరు భక్తి మార్గం వీరిని ప్రభావితం చేసేది! భగవంతుడి పట్ల విశ్వాసంతో జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు వీరు!

**అప్పట్లో ఒక నిబంధన ఉండేది. అదేంటంటే- మిలటరీలో పనిచేసే వారు స్త్రీ, పురుష వివక్షతలేకుండాఅందరూ విధిగా విద్యాభ్యాసం చెయ్యాలని! అది రాంజీకి ఒక వరమయ్యింది!**

మిలటరీ స్కూలులో చదువుకుని అనంతర కాలంలో మరోమిలటరీ స్కూలుకు హెడ్మాస్టరుగా చాలా కాలం బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశాడు. భార్యా

పిల్లలతో సహా కొంకణంలోని "దాపోలీ"లో స్థిరపడ్డాడు. వీరికుటుంబం 'దాపోలీ'లో స్థిరపడే నాటికి భీమారావు వయసు రెండేళ్ళు!

**వీరిలో ఒక సంప్రదాయం ఉండేది- అదేంటంటే- వీరు ఏ గ్రామానికి చెందినవారో అదే వారి ఇంటిపేరుగా ఉంటుందన్న మాట! అందుకే- వీరి స్వగ్రామం "అంబావదే" వీరి ఇంటిపేరయ్యింది!**

కుటుంబంపై ఉన్న అపేక్షతో చేస్తూచేస్తున్న ఉపాధ్యాయ వృత్తిని విడచిపెట్టి 'దాపోలీ'లో స్థిరపడిన రాంజీ... కొద్దికాలం తర్వాత కుటుంబ పోషణ కష్టం కావడంతో మరో ఉద్యోగం వెతుక్కుని కుటుంబంతో సహా 'సతారా గ్రామాని'కి మకాం మార్చాడు. సతారా వచ్చిన అతి కొద్ది కాలానికే భీమాబాయికి సుస్తీ చేయడం... అశ్రద్ధ, అవగాహనాలేమి, ఆర్థిక వెసులు బాటు లేకపోవడం- వంటి అనేక కారణాలతో ఆమె మరణించడం జరిగింది. ఆరేళ్ళ వయసులో తల్లిని కోల్పోయిన భీమారావు ఆలనాపాలనా మేనత్త మీరా చూసేది.

రాంజీకి మొత్తం పధ్నాలుగు మంది సంతానం కాగా, అందులో తొమ్మిది మందిని అకాల మృత్యువు పొట్టన పెట్టుకుంది. మిగిలిన వారు బలరాం, ఆనందరావు, మంజుల, తులసి, భీమారావులు. ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెళ్ళిళ్ళయిపోయాయి.

తండ్రి మాలోజీ సక్‌పాల్ మహర్ మిలటరీలో పనిచేయడంవల్ల సైనిక పాఠశాలలో చదువుకుని, అనంతరం పాఠశాల హెడ్మాస్టర్‌గా పనిచేసిన రాంజీకి మరాఠీలో మంచి భాషా పరిజ్ఞానం ఉండేది. నిష్ణాతులైన బ్రిటీష్ ఉపాధ్యయుల శిక్షణలో ఇంగ్లీషులో కూడా మంచి ప్రావీణ్యం సాధించాడు. ఇంగ్లీషు నుంచి మరాఠీ లోకీ, మరాఠీ నుంచి ఇంగ్లీషులోకీ అనువాదం చేయడం. గణిత సంబంధమైన అంశాలూ ఆయన కెంతో ఇష్టం!

**తండ్రి ద్వారా అనేక విద్యా విషయక విశేషాలను చిన్నతనం నుంచి ఔపోసన పట్టిన భీమారావు తండ్రిలాగే అనువాదం చెయ్యడంలోనూ మంచి ప్రతిభ కనబరచేవాడు. బిడ్డ ఆసక్తిని గమనించిన రాంజీ మరిన్ని మెళకువలు నేర్పడంకోసం ఎక్కువ సమయం వెచ్చించేవాడు.**

రాంజీ శాకాహారి. దళితజాతుల అభివృద్ధికీ, స్త్రీలకు విద్యావకాశాల కల్పన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహాత్మా జోతిబా పూలేకు రాంజీ అత్యంత సన్నిహితుడు, ప్రియశిష్యుడు కూడా! 1892కాలంలో సైన్యంలోకి మహర్లను తీసుకోవడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ అర్జీలుపెట్టిన మానవతావాది!

**సమాజ సంక్షేమం కోసం, జాతి అభ్యున్నతి కోసం, మానవతా విలువల కోసం కృషి చెయ్యడం భీమారావుకు తండ్రి నుంచి సంక్రమించిన వారసత్వ లక్షణాలే!**

## చదువు పోరాటం

మనిషిని మనిషే అణగద్రొక్కే అరాచక విధానాలు అమలులో ఉన్న కాలమది. మితిమీరిన అహంకారంతో అగ్రవర్ణాలు మిగిలిన కులాలకు చెందిన ప్రజల్ని అస్పృశ్యులుగా, అంటరానివారిగా తక్కువచేసి చూడటం ఎక్కువగా ఉన్న రోజులవి. అటువంటి పరిస్థితుల్లో విద్య నిమ్నకులాలకు అందని ద్రాక్ష. భరతఖండంపై తమ అధికారపు విజయకేతనాన్ని ఎగురవేసేందుకు సహకరించిన అగ్రవర్ణాలవారిని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎక్కువగా గౌరవించేవారు. అందుకే–

**భారతదేశంలో బానిసత్వాన్ని నిర్మూలించిన బ్రిటిష్ ప్రభుత్వం నిమ్న జాతుల్ని అగ్రవర్ణాలు అణగద్రొక్కుతున్నా చోద్యం చూశాయే తప్ప అదేమని ఏనాడూ ప్రశ్నించలేదు. కాబట్టే నిమ్నజాతులకు సరియైన పనిలేదు. తిండి లేదు, వసతి లేదు, విద్యలేదు. నిజం చెప్పాలంటే బతుకే లేదు.**

ఆనాటి పరిస్థితులు ఎలా వున్నాయంటే– ఎంతదూరమైనా కాలినడకన వెళ్ళాల్సిందే... గుర్రపు బగ్గీలు ఎక్కే అదృష్టం అగ్రవర్ణాలదే! ఎక్కడైనా సంచరించే స్వేచ్ఛ అగ్రవర్ణాలదే... మిగిలిన వారంతా తలవంచుకు తప్పుకు తిరగాల్సిందే! దాహం వేస్తే బావుల్లో నీరు తమ ఇచ్ఛవచ్చిన రీతిలో అగ్రవర్ణాలు చేదుకు తాగవచ్చు... నిమ్నజాతులవారికి దాహం వేస్తే మురుగుకుంటలవంక చూపుడువేలు చూపి తాగమని సౌంజ్ఞ చేస్తారు! చదువుల బడుల్లోకి ఎంచక్కా వెళ్లగలిగే అదృష్టం అగ్రవర్ణాలదే... నిమ్న జాతులు చదివితే చదువు మైలపడుతుందట!

**చదువుసంధ్యల్లేక, బతికే దారిలేక, ఎలా బతకాలో తెలియక, ఏదోలా బతికేస్తున్న నిమ్నజాతులకు కొందరు సంస్థానాధిపతులు, మరికొందరు రాజులు, ఇంకొందరు సంఘసేవాభిలాషులు చదువుకునే అదృష్టాన్ని కల్పించారు...! అందుకోసం ప్రత్యేకంగా బడులను తెరిచారు...! అయినా టీచర్లందరూ బ్రాహ్మలే... నిమ్న జాతుల పిల్లలు తరగతి గదిలో మూలన ఒదిగొదిగి కూర్చోవాల్సిందే...!**

1821లో పూనాలో సంస్కృత పాఠశాల తెరిచారు. అందులో అన్ని కులాలకూ ప్రవేశం కల్పించారు. అలా వీల్లేదని బ్రాహ్మణులు భీష్మించారు. కొందరు ఉపాధ్యాయులైతే ఉద్యోగాలొదిలి వెళ్లిపోయారు. 'ఇలా అయితే ఎలా? విద్యలేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుంది?' అని ఆలోచించిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోనంది. దీంతో దళిత విద్యార్థికి చదువుకునే అదృష్టం దక్కింది.

1953లో బరోడా మహరాజు సయాజీరావు గాయక్వాడ్ నిమ్నజాతుల వారికోసం ప్రత్యేకంగా ఓ పాఠశాల ప్రారంభించారు. అక్కడ టీచర్లుగా పనిచేయడానికి అగ్రవర్ణాల గురువులు ససేమిరా అన్నారు. చివరకు మహ్మదీయ గురువులు పిల్లలచేత ఓనమాలు దిద్దించారు.

1856లో ఈ వివాదం ఇంకొంచెం ముదిరింది. కులం కారణంగా ఓ విద్యార్థికి స్కూల్లో సీటివ్వనన్నారు. సీటివ్వాల్సిందిగా ఎవరెంత బతిమాలినా కుదరదంటే కుదరదంటూ అగ్రవర్ణాల అధీనంలో ఉన్న స్కూలు యాజమాన్యం భీష్మించుకుని కూర్చుంది. ఈ విషయమై విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. అందరికీ చదువుకునే అవకాశం కల్పించాల్సిందేనన్న కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం... ప్రభుత్వ సహాయంతో నడుపుతున్న విద్యాసంస్థల్లో కులం కారణంగా ఏ విద్యార్థికీ ప్రవేశం నిరాకరించకూడదంటూ 1858లో ఉత్తర్వులు జారీచేసింది. నిమ్నకులాల అభ్యున్నతికి ఇదో మలుపు.

**నిమ్నకులాల చదువుకు ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా... ఎవరెన్ని అవకాశాలు కల్పించినా ప్రయోజనం అంతంతమాత్రమే! దిగువ జాతుల పిల్లలు స్కూలుకెళ్లి చదువుకోవాలంటే అన్ని అవమానాలే...! అన్నీ ఆటంకాలే...!**

పాఠశాలల ప్రాంగణంలోకి వచ్చినా, క్లాసుల్లోకి వెళ్ళే అవకాశం ఉండేది కాదు...! క్లాసుల్లోకి వెళ్లినా వాళ్లతో ఎవరూ మాట్లాడేవారు కాదు...! ఒకవేళ మాట్లాడినా మాటకు ముందు, మాటకు వెనుక అవమానకర మాటల తూటాలు...! తోటి పిల్లలే కాదు, ఉపాధ్యాయుల ప్రవర్తన కూడా ఇదే విధం...! ఇన్ని అవమానాలతో చదువుకుని సాధించేదేమిటి? అన్న అంతర్మథనంలో కొట్టుమిట్టాడుతూ చదువు మానేయడమే ఉత్తమం అనుకుని అత్యధికులు ఇళ్లకే పరిమితమయ్యేవారు...!

## ఒకే ఒక్క బ్రాహ్మడు...!

**'ఎంత చదివినా చదివిన చదువుకు సార్థకత రావాలంటే తప్పనిసరిగా స్కూలుకెళ్లాల్సిందే...!**
**అందుకోసం ఎంతకష్టానికైనా ఓర్చుకోవలసిందే..!'**

రాంజీ ఆలోచన ఇది. అందుకే తన పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించడానికి ఆయన చెయ్యని ప్రయత్నం లేదు. సతారా లోని ఓ ఉపాధ్యాయుడు పిల్లల్ని క్లాసులోకి రానిస్తానంటూ హామీ ఇవ్వడంతో ఆనందరావు, భీమారావులను ఆ స్కూల్లో చేర్చాడు.

వీరు తోటిపిల్లలు రావటానికి కాస్తంత ముందుగా వెళ్లి క్లాసులో ఓ మూలగా గోనెపట్టా పరుచుకుని కూర్చోవాల్సి వచ్చేది. అక్కడినుండి ఎటూ కదలకూడదు. ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. తోటి పిల్లలు ఎవరూ వీళ్లతో మాట్లాడరు. ఉపాధ్యాయులు కూడా వీళ్లని ప్రశ్నలడగడం కాని, నోట్సులు దిద్దడంకాని చేయరు. వీళ్లు మాట్లాడితే నోటిమాట ద్వారా వచ్చే గాలివల్ల వాతావరణం కలుషిత మౌతుందట...! నోట్సు దిద్దితే, దాన్ని తాకడం వల్ల మైలపడతారట...! దాహం వేస్తే సైగ చేయాలి. ఎవరైనా దయతలచి దూరంనుండి బాగా ఎత్తుగా పెట్టి చెంబుతో నీళ్లుపోస్తే తాగాలి...! ఇంత అవమానకర పరిస్థితులలో చదువుకోవాలంటే ఎంత కష్టమో ఆలోచించాల్సిందే...!

**స్కూలు మొత్తం ఏవగించుకుంటున్నా వీళ్లని మనిషిలా గుర్తించినదీ, గౌరవించినదీ, అభిమానంగా పలకరించినదీ, ఆదరించినదీ ఒకే ఒక్క బ్రాహ్మడు...!**

**ఆయనకు కులమతాలకంటే చదువుసంధ్యలమీదే నమ్మకం ఎక్కువ...! చదువుకునే పిల్లలంటే అభిమానం, వాత్సల్యం...! ఒకరు ఎక్కువగా, ఒకరు తక్కువగా ఎవ్వరూ ఉండరనీ, అందరూ మనుషులేననీ, మనుషులందరూ సమానమేననీ, మనిషికి కులంతోకంటే, చదువువల్లనే సంస్కారం వస్తుందని నమ్మే సంస్కారం ఆయనది...!**

మంచి ఆలోచనలు ఆయనకున్నప్పటికీ సహజంగా భయస్తుడైన ఆయన తోటి అగ్రవర్ణాల వారికి ఎదురువెళ్లే సాహసం చేయలేకపోయాడు. అందుకే చదువులో ముందున్న భీమారావు అంటే ఆయన అభిమానించాడు, ప్రేమించాడు, ప్రోత్సహించాడు, మనిషిగా గౌరవించాడు.

**ఈ జనారణ్యంలో తననూ ఓ విద్యార్థిగా గుర్తించి అభిమానించే ఆ గురువుగారంటే భీమారావుకి అంతులేని గౌరవం, ఆరాధన...! ఆ టీచరుగారి పేరు అంబేద్కర్.**

ఆయనమీదున్న గౌరవంతోనే నీ పేరేమిటని ఎవరైనా అడిగితే వెంటనే 'అంబేద్కర్' అంటూ అంబావడేకర్ భీమారావు బదులిచ్చేవాడు. అలాఅలా భీమారావు 'అంబేద్కర్'గా చలామణి అయి కొద్దికాలం తరువాత స్కూలు రికార్డుల్లో సైతం అంబేద్కర్‌గా నమోదుచేయించుకున్నాడు.

## బాగా చదవాలి...

భార్యా వియోగంతో ఉన్న రాంజీ బంధుమిత్రుల సలహాతో మరో పెళ్ళి చేసుకున్నాడు. తన తల్లి స్థానంలో మరొకర్ని ఊహించుకోవడం అంబేద్కర్‌కు అస్సలు నచ్చలేదు. కుండబద్దలు కొట్టినట్లుగా ఆ విషయాన్ని నాన్నతో చెప్పేశాడు. మాటామాటా పెరిగింది. అంబేద్కర్‌కు ఆవేశం, ఆగ్రహం వచ్చేశాయి. ఇల్లు వదిలి వెళ్ళిపోవాలనుకున్నాడు. తండ్రి మీద ఆధారపడకుండా ఏదైనా పనిచేసుకుని బతకాలనుకున్నాడు...!

**అంతలోనే మరో ఆలోచన ... ఇందులో తండ్రి తప్పేముంది? పోయిన వారితో పోవడం, తోడులేకుండా జీవించడం కష్టమే అనిపించింది. ఆ ఆలోచన మనసులోకి రాగానే ఎందుకో మనసు తేలికయినట్లనిపించింది..! మనసు చదువు మీదకు మళ్ళింది..!**

అణా కాణీ చదువుతో చాలీ చాలని సంపాదన ఇచ్చే ఏదో ఒక ఉద్యోగం చేస్తూ బతుకు వెళ్ళదీయడం కన్నా- బాగా చదువుకుని మంచి స్థాయికి తాను చేరుకోవడంతో బాటు, తనవారికి కూడా అంతో ఇంతో సహాయంగా ఉండటమే తన కర్తవ్యంగా నిశ్చయించుకున్నాడు. మనసు మరింత తేలికయ్యింది! ఏదో తెలియని ఉత్సాహం అతనిలోకి ప్రవేశించింది.

**చదువు కోవాలన్న అతని నిర్ణయం రేపటి భారతచరిత్రను సువర్ణలిఖితం చేస్తుందన్న నిజం అప్పట్లో అతనికి తెలియదు...!**

1907లో మెట్రిక్‌పాసైన అంబేద్కర్‌ను ప్రఖ్యాత సంఘసంస్కర్త ఎస్.కె.బోలే అభినందించాడు. ప్రసిద్ధ మరాఠీ రచయిత కృష్ణాజీ అర్జున్ కేలూస్కర్ ఆ అభినందన సభకు హాజరై తాను రచించిన 'గౌతమ బుద్ధుని జీవితచరిత్ర' బహూకరించి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటూ ఆశీర్వదించాడు.

**ఆ ఆశీర్వాద బలమే అంబేద్కర్‌ను చదువులో ముందడుగు వేసేటట్లు చేసిందనడం సత్యదూరమేంకాదు...!**

## విజయమే లక్ష్యంగా...

**అందరూ విజయం సాధించాలనుకునేవారే!**
**అయితే – కొందరే విజయం సాధిస్తుంటారు!**
**ఇందుకు కారణం–**
**విజేతలు అవిశ్రాంతంగా కృషి చేస్తూనే ఉంటారు!**
**అందుకు చక్కటి ఉదాహరణ అంబేద్కర్!**

ఉన్నత చదువు కోసం లండన్ వెళ్ళిన అంబేద్కర్ విశ్రాంతి అనే మాటే మరచి పోయాడు! చదువుకోవడమే తనకు విశ్రాంతిగా మార్చుకున్నాడు. ఒక్క క్షణం వృధా కాకుండా ఏ చదువు కోసమైతే లండన్ వచ్చాడో ఆ చదువును సంపూర్ణంగా జౌపాసన పట్టేశాడు. లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియం గ్రంధాలయం, ఇండియా ఆఫీసు గ్రంధాలయం, లండన్ విశ్వవిద్యాలయ గ్రంధాలయం, సిటీ గ్రంధాలయం ఇలా – అన్ని లైబ్రరీలలోని పుస్తకాలు అంబేద్కర్ మస్తకంలో నిక్షిప్తమయ్యాయి!

బ్రిటీష్ మ్యూజియం గ్రంధాలయాన్ని ఉదయం తెరవగానే మొట్టమొదట ప్రవేశించేదీ, సాయంత్రం మూసివేసే సమయానికి అక్కడ ఉండే ఆఖరి వ్యక్తీ కూడా అంబేద్కరే!

**బ్రిటీష్ మ్యూజియం గంథ్రాలయంలోని పుస్తకాలన్నింటినీ చదివినవారు ప్రపంచం మొత్తం మీద చాలా తక్కువ మంది మాత్రమే. ఆ అతికొద్ది మందిలో ఒకరు కారల్‌మార్క్స్ అయితే మరొకరు అంబేద్కర్!**

ప్రపంచం మొత్తం నిద్రపోతున్నప్పుడు కూడా విజేతలు పనిచేస్తూనే ఉంటారనేదానికి అంబేద్కరే నిజమైన ఉదాహరణ! ఎప్పుడూ చదువుతూనే ఉండే అంబేద్కర్ నిద్రపోయేందుకు కేటాయించే సమయం అతి తక్కువ!

లండన్‌లో అంబేద్కర్‌తో బాటు ఉండే అతని రూమ్‌మేట్ అసనోడ్కర్ రాత్రి సమయంలో ఎప్పుడు నిద్రలేచినా చదువుకుంటున్న అంబేద్కరే దర్శనమిచ్చేవాడు. విశ్రాంతి తీసుకోమని చెబుతే ఓ చిన్న చిరునవ్వు విసరి మళ్ళీ చదువులో నిమగ్నమయ్యే వాడు. అకుంఠిత దీక్షతో సాగిన ఈ విద్యార్జనాయజ్ఞం ఆయనకు రెండేళ్ళల్లో మూడు పట్టాలను ప్రదానం చేసింది. న్యాయశాస్త్రంతో బాటు అర్థశాస్త్రంలో ఎమ్మెస్సీ, డాక్టరేట్ పట్టాలను తన సొంతం చేసుకున్నాడాయన.

**నిమ్నజాతులవారిలో బారిస్టర్**
**(న్యాయశాస్త్రంలో బార్ -ఎట్ -లా పట్టా) చేసిన**
**తొలివ్యక్తి అంబేద్కర్!**

**అమెరికాలో పిహెచ్‌డి, లండన్‌లో ఎమ్.ఎస్.సి, డి.ఎస్.సి, బార్‌ఎట్‌లా, జర్మనీ లోని బోన్ విశ్వవిద్యాలయంలో చదువు... ఇలా విభిన్న అంశాలపై విదేశీచదువుల్ని అందుకో గల్గిన అదృష్టం ఆగర్భదరిద్రుడైన అంబేద్కర్‌కు దక్కిందంటే - అది అతని స్వయంకృషి, చదువుపై అతనికున్న శ్రద్ధాభక్తులే అందుకు కారణం!**

అంటరానివాడి గాలిసోకితే మైలపడిపోతారన్న మూఢ విశ్వాసాలను ఛేదించి, సంపూర్ణ విద్యావంతుడై భరతానికి తిరిగి వచ్చిన అంబేద్కర్ 1923లో బారిస్టర్ వృత్తి చేపట్టాడు.

## నిత్య సంఘర్షణ

**"దినదిన గండం నూరేళ్ళాయుష్షు" లా**
**బాల్యంనుంచీ వెంటాడిన అవమానాలు, చీదరింపులు...**
**విద్యాభ్యాసానంతరం కూడా వదల్లేదు..!**

కులమతతత్వం నరనరాన పేరుకుపోయిన అగ్రవర్ణాల అభిజాత్యం... ధర్మం చెప్పాల్సిన న్యాయస్థాన ప్రాంగణంలోనూ కొనసాగింది...! విజ్ఞాన భాండాగారంగా ఆయన ఎదిగినా... కులరక్కసి ఆయన్ను బాధిస్తూనే ఉంది! బారిస్టరుగా వృత్తి చేపట్టిన అంబేద్కర్ ఆ వృత్తి ప్రారంభించేందుకే నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

హైకోర్టులో కేసు వాదించే లాయరు ముందుగా తాను వాదించబోయే కేసు వివరాలను సొలిసిటర్ చేత రాయించాలన్న నిబంధన ఉండేది. నిమ్నజాతివాడైన అంబేద్కర్ వద్ద పనిచెయ్యడానికి ఎవ్వరూ అంగీకరించలేదు...! ఒకళ్ళిద్దరు వచ్చి పనిచేద్దామని అనుకునేంతలోనే మిగిలిన లాయర్లు వాళ్ళని వృత్తి నుంచి వెలివేశారు! దాంతో మిగిలిన వాళ్ళంతా అంబేద్కర్ వద్ద పనిచెయ్యమంటే చెయ్యమంటూ తెగేసి చెప్పేశారు...! హైకోర్టులో ఉన్న ఈ నిబంధన జిల్లా కోర్టులో లేకపోవడంతో అంబేద్కర్ జిల్లా కోర్టులో బారిస్టరుగా ప్రాక్టీసు మొదలు పెట్టాడు.

అరంభంలో ఇక్కడా కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, కేసు విశ్లేషణలో అంబేద్కర్ చూపే తార్కికత జిల్లా కోర్టులోని జడ్జీలనూ, ఇతర లాయర్లనూ ఆకట్టుకోవడంతో క్రమక్రమంగా వారి అభిమానానికి పాత్రమయ్యాడు.

అంబేద్కర్ పరపతి పెరుగుతోంది! న్యాయాన్యాయ విశ్లేషణలో ఆయన చూపే పారదర్శకత సర్వజనామోదం పొందడంతో బాటు మిత్రుల సంఖ్యను ఇబ్బడిముబ్బడి చేసింది. నిమ్నజాతుల వారి కేసులు వాదించాల్సివచ్చినప్పుడు ఎటువంటి ఫీజూ పుచ్చుకునేవాడు కాదు. వచ్చిన వారిని ఆదరించి భోజన సదుపాయాలు కల్పించి న్యాయ సహాయంతో బాటు నైతిక సహాయమూ అందించేవాడు.

**అంబేద్కర్ అంటే – కులమతాలకతీతంగా**
**న్యాయ పరిరక్షణ జరుగుతుందన్న నమ్మకం ప్రజలలో ఏర్పడింది.**

## అంబేద్కర్ అందరికీ కావల్సినవాడయ్యాడు...! అందుకు 1926లో వాదించి గెలిచిన కేసు కూడా ఒక కారణమే!

బ్రాహ్మణులు హిందూ దేశాన్ని నాశనంచేశారంటూ కొందరు బ్రహ్మణేతరులు ఒక కరపత్రం విడుదల చెయ్యడంతో ఆగ్రహించిన బ్రాహ్మణులు పూనాకోర్టులో కేసు పెట్టారు. గ్రంథాలయాలలో పుస్తకపఠనం చేసే సమయంలో అక్కడున్న హిందూమత సిద్ధాంతగ్రంథాలన్నీ చదివి ఆకళింపు చేసుకున్న అంబేద్కర్ ఈ కేసువాదించే సమయంలో ఈ రెండువర్గాల వాదనలనూ విశ్లేషిస్తూ వెలువరించిన అభిప్రాయాలు సర్వమత సమానత్వాన్నీ, సమాజ హితాన్నీ ప్రబోధించడంతో అందరూ ఆయన వాదనతో ఏకీభవించారు! అంబేద్కర్ వాదనాపటిమ అందరి అభిమానాన్నీ పొందింది...!

## అంబేద్కర్ విజ్ఞాపన

### సరిగ్గా- అదే సమయంలో-

'1919నాటి చట్టాలలో చేయవలసిన సవరణ'ల కోసం సిఫార్సులు చేసేందుకు సర్ జాన్ సైమన్ అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ బ్రిటీష్ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కమిషన్‌కు సహాయంగా పనిచేసేందుకు భారతదేశంలో కొన్ని ప్రాంతీయ కమిటీలు ఏర్పాటయ్యాయి. బొంబాయి ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబేద్కర్ సైమన్ కమిషన్‌తో కలసి పనిచేశాడు.

అగ్రవర్ణాల ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నిమ్న జాతుల గురించి ఎటువంటి ప్రస్తావనా లేని సూచనలను సైమన్ కమిషన్‌కు అందజేసింది. నెహ్రూ నేతృత్వంలో ఏర్పాటైన కాంగ్రెస్ కమిటీ దేశంలోని మహ్మదీయులు, క్రైస్తవులు, సిక్కులు, ఆంగ్లో ఇండియన్లు, ద్రవిడమహాసభ ప్రతినిధులనూ సంప్రదించి, నిమ్నజాతుల వారి అభిప్రాయాలను అస్సలు తీసుకోకపోవడం అంబేద్కర్‌కు నచ్చలేదు.

అందుకే- బహిష్కృత హితకారిణీ సభ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ నిమ్నజాతుల వారి ప్రయోజనాలు కాపాడవల్సిందిగా కోరుతూ, కొన్ని సూచనలతో కూడిన వినతి పత్రాన్ని కమిషన్‌కు అందజేశాడు.

**తన వినతి పత్రంలో నిమ్నజాతుల ప్రయోజనాలతో బాటు– సమాజంలోని అన్ని వర్గాల వారి ప్రయోజనాలకూ చట్టం రక్షణ కల్పించాలని పేర్కొన్నాడు.**

దళిత జాతి శ్రేయస్సు మాత్రమే కాకుండా దేశ శ్రేయస్సు కోరుకునే సమతావాదిగా ఆయన వ్యవహరించడంతో అన్ని కులాల, మతాల, వర్గాల ప్రజలకూ సమాన న్యాయం చేసే నాయకునిగా అందరి మన్ననలూ పొందాడు. ఇదే విషయాన్ని 1930 ఆగస్ట్ 8 నాటి నాగపూర్ సభలో అంబేద్కర్ మాట్లాడుతూ–

**'ఏ దేశమూ మరోదేశాన్ని పాలించేటంత గొప్పది కాదు...'**
**'మార్పు పార్టీ వల్ల రాదు, సామాజిక చైతన్యమే అసలైన మార్పు...'**

అంటూ స్వేచ్ఛా భారత భవిష్యత్ చిత్రాన్ని ఎలుగెత్తి చాటాడు.

ఇదిలావుంటే భారతదేశంలో వేళ్లూనుకుపోయిన కులవ్యవస్థను నిర్మూలించ డానికి హిందూమహాసభ, ప్రార్థనా సమాజం, బ్రహ్మసమాజం వంటి సంస్థలు విశేషంగా కృషిచేశాయి. ఎవరెంత కృషిచేసినా సాధించినది వందలో ఒకవంతే.

**సమస్య ఎందుకు వచ్చిందో దానికి మూలకారణం ఏమిటో తెలుసుకోకుండా ఎవరికి వారు వారికి అనుకూలంగా ఆ సమస్యను విశ్లేషించడం, సమస్యకు శాస్త్రీయ పరిష్కారం సూచించక పోవడం... ఫలితంగా దేశంలో కులవ్యవస్థ అభిజాత్యాన్ని ఏమాత్రం నిరోధించలేక పోయాయి.**

అస్పృస్యత సమస్యని ఎదుర్కొంటున్న నిమ్నజాతులే ఆ సమస్య పరిష్కారానికి ఉద్యమించాలని అంబేద్కర్ పిలుపునిచ్చాడు.

## ప్రజాస్వామ్యభావాలు

**ఒక జాతిని మరోజాతి అణచిఉంచే చర్యలు ఇక్కడే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి! అందుకే– అణచిఉన్న ప్రజాగ్రహం ఒక్క సారిగా పెల్లుబికి స్వేచ్ఛా పోరాటంగా రూపుదాల్చింది! ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య భావాలు విస్తృతమయ్యాయి!**

శ్రామిక వర్గాలవారికి కొంత గుర్తింపు లభిస్తున్నట్లుగానే - భారతదేశంలో నిమ్నజాతులవారి ప్రయోజనాలకోసం జరుగుతున్న పోరాటానికి క్రమక్రమంగా ప్రజామద్దతు తోడవుతోంది!

ఈ నేపధ్యంలోనే బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో దళిత జాతుల తొలి ప్రతినిధి అయిన ఘోలాప్ చదువుకునే అవకాశం అందరికీ కల్పించాల్సిందేనంటూ డిమాండ్ చేశాడు. ప్రాధమిక విద్యను కులమతాలకు అతీతంగా నిర్భంధం చేయాలన్నాడు. బొంబాయి కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బోలే దేశ ఉజ్వల భవిష్యత్‌కు అంటరానితనం అడ్డుగోడగా నిలుస్తుందనీ, దీనిని రూపుమాపడం అత్యవసరమనీ ప్రతిపాదించాడు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన బొంబాయి ప్రభుత్వం... నిమ్నజాతులవారు ప్రభుత్వ రంగంలోని అన్ని సౌకర్యాలనూ అందరితో సమానంగా, స్వేచ్ఛగా వినియోగించు కోవచ్చునంటూ ఉత్తర్వులు జారీచేసింది.

## ఆత్మగౌరవానికి అర్ధం చెప్పిన అంబేద్కర్

**క్రమక్రమంగా దళితుల్లో చైతన్యం వస్తోంది!**
**అయితే ఆ చైతన్యాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే**
**ఎత్తుల పైఎత్తుల గమ్మత్తులు ఎప్పుడూ జరుగుతూనే వున్నాయి!**

నిమ్నజాతులకు విద్యావకాశాలు కావాలని ఆందోళన చేస్తున్న ఉద్యమ నాయకులను శాంతపరచాలన్న లక్ష్యంతో దళిత జాతులకు విద్యావకాశాలయితే వచ్చాయికానీ, వారిలో అణువణువూ పెనవేసుకుపోయిన బానిస భావనలను తొలగించే ప్రయత్నం జరగలేదనే చెప్పాలి. అగ్రవర్ణాల వారు కనిపించగానే వంగొంగి దణ్ణాలు పెట్టడం. 'నీ బా చాంన్ దొరా....' అంటూ వినయ విధేయతలు ప్రకటించడం, వారేం చెప్పినా అది మంచా? చెడా? ఆ పని చెయ్యవచ్చా...? చెయ్యకూడదా...? ఇలాంటి కనీస ఆలోచన కూడా లేని అమాయక జనాన్ని చూస్తే అంబేద్కర్‌కు దుఃఖం ఆగేది కాదు! అతనికి తన చిన్ననాటి రోజుల్లో ఎదురైన అనుభవాలే ఎప్పుడూ గుర్తుకు వచ్చేవి! 'ఈ పరిస్థితి మారాలి..! ప్రజలు ఆలోచించడం ప్రారంభించాలి...! అది ఎలా సాధ్యమౌతుంది?' ఇదే అంబేద్కర్ నిరంతర ఆలోచన!

**కలసి భోజనం చేసినంత మాత్రాన నవ్వుతూ పలకరింపులు సాగించి నంత మాత్రాన... మార్పు వచ్చినట్లుగాదన్నది ఆయన భావన...! కంటి తుడుపుగా సాగే ఈ చర్యలు పైపై మాటలేగానీ, అంతరంగంలోంచి వచ్చిన నిష్కల్మష హృదయావిష్కరణ కాదన్నది ఆయన నమ్మకం...! అణచి వేతకు గురౌతున్న జాతులలో నిజమైన చైతన్యం రావాలన్నది ఆయన అభిలాష!**

అందుకే –ఆయన తనను కలసిన దళితులకు – అందరిలాగే మనమూ పుట్టాం.. అందరిలాగే మనమూ బతుకుదాం! మనని మనం మార్చుకోకుంటే ఈ బానిస సంకెళ్ళను తెంచుకోలేం! ఒకరిపై ఆధారపడి బతకాలన్న ఆలోచన వదిలేసి, వృత్తి విద్యలు నేర్చుకుని మనని మనం అభివృద్ధి చేసుకుందాం. మన పిల్లలకు మంచి విద్యా బుద్ధులు చెప్పించడంతో బాటు ఆత్మ గౌరవంతో తల ఎత్తి బతికేలా ఉత్సాహ పరుద్దాం.... అంటూ హితవు చెప్పేవాడు.

**సభ్య సమాజంలో మిగిలిన అందరిలాగే మనకు కూడా తినడం, తిరగడం,దుస్తులు ధరించడం, చదువుకోవడం జన్మహక్కులు.వీటిని ఎవ్వరూ కాదనలేరు అంటూ 'మనమూ మనుషులమే' అని గుర్తు చేసేవాడు. మృదు మధురంగా సాగే అంబేద్కర్ హితవాక్యాలు అందరిలోనూ కొత్త ఆలోచనలు రేకెత్తించాయి!**

ఓ పక్క రాజకీయ హక్కుల కోసం ఉద్యమాలు జోరుగా సాగుతుండగా అంబేద్కర్ మాత్రం వీటన్నింటికీ దూరంగా వున్నాడు. ఏ హక్కులూ లేని దళితులకు రాజకీయ హక్కులకంటే ముందుగా మనుషులుగా గుర్తింపబడాలనేది ఆయన ఆలోచన! అందుకే కొన్నాళ్ళు పత్రికగా నడిపి ఆపివేసిన 'మూక్‌నాయక్' పేరుతోనే దళితజాతుల కనీస హక్కుల కోసం ఉద్యమించే ఒక సంస్థ ప్రారంభించాడు. దళితుల జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, విద్యా వసతుల ఆవశ్యకత, దళితులపై జరిగే అత్యాచారాలను అకృత్యాలను ఎండగట్టడం ఈ సంస్థ కార్యక్రమాలు.

కరపత్రాలు ముద్రించి సమస్యనూ, సమస్య తీవ్రతనూ, సమస్య మూలాలనూ, సమస్య పరిష్కార మార్గాలనూ వెల్లడించి దళితులలో కొత్త చైతన్యం ఊపిరి పోసు కునేందుకు అవిశ్రాంతంగా కృషి చేశాడు.

**అగ్రవర్ణాల దాష్టీకానికి గురౌతూ అవమానాల పాలవుతున్న**
**నిమ్న జాతీయులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.**
**దళితులంతా ఏకమయ్యారు...!**
**తమ కనీస హక్కుల కోసం ఉద్యమబాట పట్టారు.**

## చెరువు ఒక్కరి సొత్తుకాదు..

**మంచినీటి చెరువులు**
**ఏ ఒక్క కులానికీ లేదా మతానికీ చెందినవి కావు!**
**దేవుడు అందరికీ దేవుడే!**
**ఊరి చెరువులో నీరు, దేవాలయంలోని దేవుడు**
**ఏ ఒక్కరి అదుపాజ్ఞల్లోనూ లేడు!**

ఈ విధంగా అంబేద్కర్ స్పష్టం చెయ్యడంతో బాటు నీటికోసం పోరుబాట పట్టడం తప్పేంకాదంటూ ఉద్బోధించాడు. అంతే... ప్రకృతిప్రసాదితమైన ఊరి చెరువు నీళ్ళను అగ్రవర్ణాలు మాత్రమే ఉపయోగించుకోవాలనీ, నిమ్న జాతులకు చెరువు నీటిని తాగే అర్హత లేదనీ, హిందూ దేవాలయాలు పవిత్ర స్థలాలనీ, దేవాలయ ప్రాంగణంలోకి దళితులు ప్రవేశించకూడదనీ అగ్రవర్ణాలు విధిస్తున్న ఆంక్షలు ధిక్కరిస్తూ వేలాదిమంది నిమ్న జాతీయులు పెద్దఎత్తున ఊరేగింపుగా వెళ్ళి మహద్‌లోని చౌదర్ చెరువునీటిని తాకడంతోబాటు ఆ నీటితో గొంతు తడుపుకున్నారు. ఇందుకు ఆగ్రహించిన అగ్రవర్ణాల పెద్దలు ఘర్షణలకు దిగడం, పోలీసులు కొందర్ని అరెస్టు చేసి విచారణ జరిపి నేర నిరూపణ జరిగిన అయిదుగురిని కఠినంగా శిక్షించడం జరిగింది.

చౌదర్ చెరువు నీటిని నిమ్న జాతీయులు తాకడం, తాగడంతో చెరువు అపవిత్రమైపోయిందని సవర్ణ హిందువులు ఆందోళన వ్యక్తంచేశారు.

**మంత్ర పూర్వకంగా శుద్ధ కార్యక్రమం నిర్వహించారు.**
**ఈ విషయం తెలిసిన దళితులు జరిగిన అవమానాన్ని తట్టుకోలేకపోయారు.**

**ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలనుకున్నారు.**

**తద్వారా తమ హక్కులు సాధించుకోవాలనే స్థిర సంకల్పానికి వచ్చారు. నిమ్న జాతులకు జరుగుతున్న అవమానాలనూ, అన్యాయాలనూ విచారించి తమకు న్యాయం చెయ్యాలని ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం పంపారు.**

జరిగిన సంఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. చౌదర్ చెరువు నీళ్ళు అందరికీ చెందుతాయనీ, నిమ్నజాతుల వారు కూడా ఈ నీటిని వాడుకోవచ్చునని 1927 ఆగస్టు 4న మహద్ మున్సిపాలిటీ ప్రకటించగా, ప్రైవేటు వ్యక్తులకు చెందిన చెరువును అందరికీ వర్తింప చెయ్యడం కుదరదంటూ సవర్ణ హిందువులు కోర్టు కెక్కడంతో మున్సిపాలిటీ ఉత్తర్వుపై కోర్టు స్టే ఇచ్చింది. సవర్ణ హిందువులు తాత్కాలిక విజయం సాధించారు. ఉద్యమం మరింత ఉగ్రరూపం ధరించింది. దళితులు మహద్‌లో సత్యాగ్రహం చెయ్యాలని నిర్ణయించడంతో సత్యాగ్రహాన్ని నిలుపు చెయ్యమంటూ అంబేద్కర్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. దళితుల కనీస హక్కుల సాధనే తనకు ముఖ్యమంటూ అంబేద్కర్ స్పష్టం చెయ్యడంతో సత్యాగ్రహ ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. 1927 డిసెంబరు 25న జరిగిన మహాసభలో అంబేద్కర్ ప్రసంగిస్తూ...

**ప్రజలలో అసమానతలకు కారణమైన వర్ణ వ్యవస్థను పూర్తిగా విడనాడ వల్సిందేనంటూ స్పష్టం చేశాడు. మనిషిగా పుట్టిన ప్రతి వ్యక్తికీ పుట్టుకతోనే కొన్ని హక్కులు వస్తాయనీ, స్వేచ్ఛగా బతికే హక్కు లేకుండా చేస్తున్న అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించాల్సిందేనని డిమాండ్ చేశారు.**

1789లో ఫ్రాన్సులో జరిగిన మానవహక్కుల పోరాటాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశాడు. అనేక మలుపులు తిరిగిన ఈ వివాదం 1928 ఫిబ్రవరి 23న మహద్ సబ్‌జడ్జి చెరువుపై ఉన్న నిషేధపు ఉత్తుర్వులను రద్దు చేయడంతో ఉద్యమం కొంత శాంతించింది.

**అయినా లోలోపల సమస్య రగులుతూనే వుంది.**

## దళితులకు ప్రభుత్వోద్యోగాలు

**అంబేద్కర్ జీవితం పూర్తిగా దళితుల అభ్యున్నతికే అంకితం అయ్యింది. హిందువులలో ఒకరిగా పుట్టినా సాటి హిందువుల దాష్టికానికి బలవుతున్న నిమ్న జాతులకు విద్య, ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యత కల్పించాలంటూ డిమాండ్ చేశారు.**

బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ అయిన తర్వాత తన వాదననూ, నిమ్నజాతుల వేదననూ కౌన్సిల్ సమావేశాలలో నిర్భయంగా ప్రకటించాడు. అంబేద్కర్ వివరణాత్మక ప్రసంగాలు ప్రభుత్వ పెద్దల ఆలోచనల్లో సానుకూల మార్పుకు కారణమయ్యాయి!

**అంబేద్కర్ ఒత్తిడితో అర్హులైన నిమ్నజాతి వారనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి!**
**చదువుతో తమ రాతలు మారతాయన్న నమ్మకం కలిగింది!**

**హిందువులుగా పుట్టి హిందువులుగా పెరిగిన తమకు హిందూ దేవాలయాలలో ప్రవేశించే హక్కు ఉందంటూ నిమ్న జాతుల వారు ఎలుగెత్తి చాటారు.**

దేవాలయాలలోకి దళితుల ప్రవేశానికి ఒక పెద్ద ఉద్యమమే సాగింది. ఈ ఉద్యమానికి అంబేద్కర్ ప్రత్యక్ష పరోక్ష ప్రోత్సాహాలు పెద్ద సంచలనమే సృష్టించింది. మొట్టమొదటగా బొంబాయిలో నూతనంగా నిర్మించిన ఠాకూర్ధ్వార్ ఆలయ ప్రవేశానికి అందరిని అనుమతించడంతో దైవదర్శనానికి అంబేద్కర్ వెళ్ళాడు. అయితే సవర్ణ హిందువులు తీవ్రంగా ప్రతిఘటించడంతో దేవాలయ అధికారులు అంబేద్కర్‌ను దైవదర్శనం చేయనివ్వకుండా బయటకి పంపించి, శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఇది దళిత జాతుల ఆగ్రహానికి కారణమయ్యింది.

**దళితుల హక్కుల పోరాటంలో దేవాలయ ప్రవేశమూ ఓ ప్రధాన అంశంగా మారింది. దాంతో దేశంలోని పలు ప్రాంతాలలో దేవాలయ ప్రవేశానికి దళితులు ఉద్యమాలు చేపట్టడం, సవర్ణ హిందువులు ఘర్షణలకు దిగడం పరిపాటిగా మారింది.**







Subedar Ramji Maloji Sakpal was the father of
Dr. Bhimrao Ambedkar
who was a Subedar - Major in army.
Ramji & his wife Bhimabai were blessed with
their fourteenth child Bhimrao.
Dr. Ambedkar was fondly called
'Bhima' by his father

The first Satyagraha at Mahad against the prohibition on untouchables to have drinking water at the public pond. (25.12.1927)





Poona Pact Sept.24, 1932. From the left - Barrister M.R.Jaykar, Sir Tej Bahadur Sapru, Kajolkar, P.Balu and other leaders are seen outside the Yerawada Central Jail.



[illegible]
([illegible]),
[illegible]...



A view of Kalaram Temple Entry Satya-Graha at Nashik under the leadership of Dr.Ambedkar. (1930)



The First Round Table Conference was inaugurated by King George-V on Nov.12, 1930 in London, Dr.Ambedkar, Delegate, seen in the left row.



Second Round Table Conference held in London on Sept.7, 1931 under the Chairmanship of Mr. Ramasay Mac Donald, British Prime Minister. Gandhiji, Pandit Madam Mohan Malaviya, Barrister M.R.Jaykar & Dr.Ambedkar.

పూనాలోని పార్వతీదేవి ఆలయం, నాసిక్‌లోని కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమాలు ప్రముఖమైనవి. ముఖ్యంగా కాలారామ్ దేవాలయ ప్రవేశం నిమిత్తం 1930లో పెద్ద ఊరేగింపుగా వెళ్ళిన దళితుల్ని నిరోధించేందుకు ఆలయ ప్రదాన ద్వారాలు పూజారులు మూసివేశారు. ఇరువర్గాలలో ఏ ఒక్కరూ వెనక్కి తగ్గకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలలో ఉద్రిక్త వాతావరణం సుమారు నెల్లాళ్ళపాటు కొనసాగింది. ఈ నెలరోజులూ ఆలయం మూతపడింది. స్వామివారి రథోత్సవం దగ్గరపడటంతో దళితులతో రాజీకొచ్చిన సవర్ణులు రథాన్ని ఇరువర్గాలూ కలసి లాగేందుకు సమ్మతించారు. అయితే ఆ రోజున దళితులకు తెలియకుండా ఆలయ వెనుక మార్గంనుంచి రథయాత్రను పోలీసు బందోబస్తుతో సవర్ణులు నిర్వహించే ప్రయత్నం చేయడంతో ఆ ప్రయత్నాన్ని దళితులు అడ్డగించారు. ఈ సందర్భంగా పెద్ద ఘర్షణే జరిగింది. అనేకమంది గాయపడ్డారు. ఫలితంగా ఆలయం ఏడాదిపాటు మూత పడింది. దేవాలయం మూతపడేందుకు దళితులే కారణమని ఆరోపిస్తూ నిమ్నజాతులపై మరిన్ని ఆంక్షలను సవర్ణ హిందువులు అమలు చెయ్యడం ప్రారంభించారు. ఈ వివాదం చల్లారడానికి చాలాకాలమే పట్టింది.

## దేశ స్వాతంత్ర్యం కన్నా... జాతి స్వాతంత్ర్యమే మిన్న...

**భారతీయులలో స్వాతంత్రేచ్ఛ క్రమక్రమంగా బలపడుతోంది.**

భరతమాత దాస్య విముక్తికి అందరూ ఒక్కటై సంఘటిత పోరాటం చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లో జేరమంటూ అంబేద్కర్‌కు ఆహ్వానం అందింది. అయితే ఈ ఆహ్వానాన్ని అంబేద్కర్ సున్నితంగా తిరస్కరించాడు.

దేశ స్వాతంత్ర్యం కన్నా

తనకు జాతి స్వాతంత్ర్యమే మిన్నని సమాధానమిచ్చాడు.

**స్వరాజ్య సాధనకు తగిన సమయం ఇంకా రాలేదని ఆయన అంటూనే, రెండువేల ఏళ్ళనుంచి బానిసత్వంలో మగ్గుతున్న నిమ్నజాతి వారికి కనీస హక్కుల సాధన తనకు అత్యంత ముఖ్యమని చెప్పేవాడు.**

దేశానికి స్వాతంత్ర్యం వస్తే దాన్ని నిలబెట్టుకునే పరిణితి మనకింకా రాలేదేమోనన్న సంశయాన్ని ఆయన వ్యక్తం చేస్తూనే, డొమినియన్ స్టేటస్ కోరడం మంచి ప్రతిపాదన కాగలదని సూచించాడు. దాంతో స్వరాజ్య సాధన పట్ల అంబేద్కర్‌కు సరియైన అవగాహన లేదని **ఆరంభంలో విమర్శించిన వారే – ఆ తర్వాత కాలంలో ఆయన ఆలోచనా తీరు సమంజసమైనదేనని అంగీకరించారు.**

**దేశస్వాతంత్ర్యమంటే అధికారం చేతులు మారడం కాదు...! అధికారం చేతులు మారడం వల్ల నిమ్నజాతులవారికి ప్రత్యేకంగా జరిగే ప్రయోజనమూ లేదు..! నిమ్న జాతులవారికి మేలుజరగాలంటే నిర్ణయాధికారం ఉండాలి...! నిర్ణయాధికారం సిద్ధించాలంటే రాజ్యాధికారంలో పాలుపంచు కోవడం మినహా వేరుమార్గంలేదు...!**

సమాజంలో అన్నిటా సమభాగం ఉన్నప్పుడే అన్నిరకాల సమస్యలూ పరిష్కారమవు తాయి...! అప్పుడే రెండువేల ఏళ్లకు పైబడిన బానిసత్వపు బంధనాలు పూర్తిగా తొలగి పోతాయి...! సాంఘికంగా ఎదిగే అవకాశాలు మెరుగుపడతాయి...! దళితజాతుల జీవితాలలో కొత్త అధ్యాయం మొదలవుతుంది...!

అంబేద్కర్ మాటలు కాంగ్రెస్‌వారికి అస్సలునచ్చలేదు....! రోజురోజుకూ మారుతున్న ఉద్యమస్వరూపంలో కొత్త ఉత్సాహం ఉరకలెత్తింది...!

## మా సమస్యలని మేమే పరిష్కరించుకుంటాం...

**1930 నవంబర్ 12**

**లండన్‌లో మొదటి రౌండ్‌టేబుల్ సమావేశం ప్రారంభమయ్యింది...!**

**స్వతంత్రభారత చరిత్రకు దశాదిశానిర్దేశం చేసిన ఉద్వేగభరిత క్షణాలవి...!**

భారతదేశం నుంచి వచ్చిన డబ్బున్న మారాజులు ఈ సమావేశంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అధికారాన్ని తమ హస్తగతం చేసుకోవాలన్న ఆరాటం ఎక్కువగా ఉన్న ప్రతినిధులే అందులో అధికం...!

**అంతమందిమధ్యలో నిమ్నజాతుల ప్రతినిధిగా ఒకేఒక్క దరిద్ర నారాయణుడు..!**

**అతనివద్ద డబ్బూ, అధికారం లాంటి హంగులేవీ లేవుగానీ, అక్కడున్న వారందరికంటే అత్యధిక విజ్ఞానం మాత్రంఉంది!అంతకుమించిన వినయం.. అంతకు పదింతల వివేకం... అంతే సమయస్ఫూర్తి ఆయన సొంతం...!**

నిజం చెప్పొద్దూ...అంతమంది మేధావుల మధ్యలో ఒకేఒక్క దళితుడు... అయినా అందరికీ ఏకకాలంలో సమాధానం చెబుతూ తన వాణిని స్పష్టంగా సూటిగా హృదయాలకు హత్తుకునేలా వివరించిన విజ్ఞానగని అంబేద్కర్!

**దళితుల సమస్యల పట్ల సానుభూతిగా స్పందించే ప్రభుత్వం కావాలి...! మానవత్వానికి కృషిచేయగల రాజ్యాంగం కావాలి...! దళితుల సమస్యల్ని వేరెవరూ తీర్చలేరు...! మా సమస్యల్ని మేమే పరిష్కరించుకోవాలి...! అందుకే - మాకు రాజ్యాధికారం అత్యవసరం...!** అంటూ అంబేద్కర్ స్పష్టంచేశాడు...!

దళితజాతుల సాంఘిక రాజకీయ హక్కుల పరిరక్షణకు సంబంధించి ఒకప్రతిపాదన ముందుగానే తయారుచేసి అక్కడ అందజేశాడు. దీనిపై చర్చలు జరిపి, అభిప్రాయాలు బ్రిటీష్ పాలకులకు తెలియజేయవల్సిందిగా భారతదేశంలోని మిత్రులను కోరాడు. సమావేశంలో **ముందుగా దళితజాతి సమస్యలను ప్రస్తావించిన అంబేద్కర్, అటుపిమ్మట స్వరాజ్యప్రతిపాదనను సమర్థిస్తూ... దేశభవిష్యత్, లక్ష్యాలు వివరించాడు. విశ్లేషణాత్మకంగా సాగిన అంబేద్కర్ ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది.**

నిన్నటి వరకూ స్వరాజ్యప్రతిపాదనపట్ల నిర్లిప్తతగా ఉన్న అంబేద్కర్ నేటి సమావేశంలో స్వరాజ్యప్రతిపాదనను సమర్థిస్తూ ప్రసంగించడం కాంగ్రెస్ వారికి సైతం ఆశ్చర్యాన్ని, ఆనందాన్నీ కలుగజేసింది.

**తాను ముందు ఇచ్చిన విజ్ఞాపనకు అనుబంధంగా మరొక పత్రాన్ని సమర్పిస్తూ...'దళితజాతులకు ప్రత్యేకంగా గానీ, ఉమ్మడి నియోజక వర్గాలలో గానీ రిజర్వుడు స్థానాలుండాలనీ, ఇరవయ్యేళ్ళ తర్వాత రిఫరెండమ్ నిర్వహించాలనీ' పేర్కొన్నాడు.**

దళితులు కూడా హిందువులలో ఒకభాగమేనని అందరూ అంటున్నప్పటికీ, వారు ప్రత్యేకమైన జాతి అనీ, అందుకే గుర్తింపు కోసం ప్రత్యేకంగా పేరుమార్పు అవసరమవుతుందనీ ఆయన చెప్పారు. అంబేద్కర్ అందజేసిన ఈ అనుబంధ విజ్ఞాపన పత్రం కొత్త ఆలోచనలకు ఊపిరి పోసింది.

**ఇదిలాఉంటే - లండన్ లో గడిపిన ఈ కొద్దిరోజుల్లో ఏ మాత్రం సమయం చిక్కినా పాతపుస్తకాల షాపులకెళ్ళడం, మంచి పుస్తకాలు కనిపిస్తే కొనుక్కోవడం, ఇలా సంపాదించిన అపురూప పుస్తకాలను భద్రపరచడం ఓ ముఖ్యమైన కార్యక్రమంగా భావించేవాడాయన. చదువంటే అంత ఇష్టం ఆయనకు.**

మొదటి సమావేశాలు ముగిశాయి. భారతానికి చేరుకున్న అంబేద్కర్ బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు మరోసారి ఎంపికయ్యాడు. కాంగ్రెస్ వారికీ దళితులకూ మధ్య పొడచూపుతున్న అభిప్రాయ బేధాలను తొలగించాలనీ, అంబేద్కర్‌ను అనునయించి కాంగ్రెస్ వైఖరిపట్లా తన భావాలపట్లా సానుకూలంగా మారేటట్లుగా ప్రయత్నించాలన్న ఉద్దేశంతో అంబేద్కర్‌ను కలుసుకోవాలని ఉన్నట్లు గాంధీ లేఖరాశారు.

**అంబేద్కర్ గాంధీ సమావేశమయ్యారు. దళితుల సమస్యలు, కాంగ్రెస్ కృషి, జరుగుతున్న కార్యక్రమాలు - ఇలా అన్నీ చర్చకు వచ్చాయి.**

తమ సమస్యల పట్ల ఇంతవరకూ ప్రదర్శితమౌతున్న నిర్లిప్తధోరణులనూ, తమ సమస్యల పరిష్కారం ఆవశ్యకతనూ స్పష్టంచేసిన అంబేద్కర్ తమది రాజీలేని పోరాటంగా తెలియజేశాడు. తన భావాలతో అంబేద్కర్ ఏకీభవించకపోవడం గాంధీని కొంత నిరాశపరిచింది.

**అభివృద్ధికి దూరంగా అవిద్యకు నిలయంగా ఉండే నిమ్నజాతివాడిలో కనిపించిన మంచిమాటతీరు, విషయ విశ్లేషణ, నిగూఢంగా ఉన్న అద్భుతపాండిత్యం గాంధీని ఆశ్చర్యపరిచాయి!**

**ఆయన అంతరంగంలో ఒక చిన్న సంచలనం మొదలయ్యింది...!**
**రేపటి భవిష్యత్ ఆయనకు లీలగా దర్శనమిచ్చింది.**

## ప్రత్యేక గుర్తింపు చాలా అవసరం

1931 సెప్టెంబర్ 7వతేదీ

రెండవ రౌండ్ టేబుల్ సమావేశం ప్రారంభమయ్యింది.

**భారతదేశమే తానుగా, తనమాటే భారతీయులమాటగా, తానుండగా**

**భారతదేశం నుంచి మరో ప్రతినిధి అవసరంలేదంటూ సాగిన గాంధీ వ్యవహారశైలిని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించాడు.**

**విద్యావకాశాలు లభించినంత మాత్రాన దళితులసమస్యలు పరిష్కారంకావనీ, అందుకే – అన్నిటా సమాన అవకాశాలు, ప్రత్యేక గుర్తింపు చాలా అవసరమని స్పష్టంచేశాడు.**

దళితుల సమస్యలపై మిగిలిన అన్నివర్గాలకూ స్పష్టమైన అవగాహన కలిగించేందుకు రెండవ రౌండ్‌టేబుల్ సమావేశాలను ఒక మంచి అవకాశంగా అంబేద్కర్ ఉపయోగించుకోగలిగాడు. ఇందుకు – ఆయన చదివిన చదువూ, నేర్చుకున్న విజ్ఞానం, సమస్యమూలాలను అధ్యయనం చెయ్యడంలో ఆయన చూపిన శ్రద్ధ, రేపటి భవిష్యత్‌పై స్పష్టమైన అవగాహన, అన్నింటినీ మించి ఆయన ప్రసంగించేతీరు – కారణమని చెప్పడం అతిశయోక్తికాదు!

## రిజర్వేషన్ సౌకర్యం

**సుదీర్ఘంగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశాలు ముగిశాయి! విభిన్న అంశాలపై పలుమార్లు జరిగిన వివిధ కమిటీల ప్రత్యేక సమావేశాల్లో తమ ఇబ్బందులనూ, అవసరాలనూ, కనీస హక్కులనూ ప్రస్తావించి అంతర్జాతీయ వేదికపై ఒక కొత్త ఆలోచనకు అంబేద్కర్ నాందీవాచకం పలికాడు.**

అంబేద్కర్ బొంబాయి చేరుకోగా, ఫిబ్రవరి నెలనుంచి భారతదేశంలో ఓటు హక్కు కమిటీ ప్రత్యేకనివేదిక తయారుచేసే పని ప్రారంభించింది. ఈ కమిటీలో అంబేద్కర్ కూడా సభ్యుడే! వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరిస్తున్న నేపథ్యంలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తమౌతున్నప్పటికీ, అంబేద్కర్ దళితజాతుల అభ్యున్నతికి తోడ్పడే స్థిరనిర్ణయాలను స్పష్టంగా వ్యక్తం చేయడంలో చూపిన సమయస్ఫూర్తి కొంతమేరకు మంచి ప్రయోజనాలనే అందించింది. 1932 మే నెలలో ఓటుహక్కు కమిటీ తన పరిశీలనను పూర్తిచేసింది.

**అస్పృశ్యజాతులను మాత్రమే దళితజాతులుగా (షెడ్యూల్డ్ కులాలు)గా పరిగణిస్తూ కమిటీ నిర్ణయించడం ఒకమంచి మలుపు.**

అంటరానివారుగా నిన్నటివరకూ అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన దళితజాతులు పురోభివృద్ధి చెందాలన్న సదుద్దేశంతో బ్రిటీష్ ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయించడంతో అగ్రవర్ణాలవారు తీవ్రనిరసన వ్యక్తం చేశారు. అయినా – ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. దాంతో **కొంతమందయితే – తామూ రిజర్వేషన్ సౌకర్యాలు పొందాలన్న ఆలోచనతో ఈషెడ్యూల్డ్ కులాలజాబితాలలో చేరేందుకు ప్రయత్నించడం కొంత చర్చనీయాంశమే అయ్యింది!**

## రాష్ట్రశాసనసభలో ప్రత్యేకస్థానాలు

**1932 ఆగస్ట్ నెలలో బ్రిటీష్ ప్రధానమంత్రి దళితుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించడంతో దళితులకు రాష్ట్రశాసనసభలో ప్రత్యేక స్థానాలు లభించాయి.**

**కమ్యూనల్ అవార్డు ఫలితంగా దళితులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కుతోబాటు జనరల్ అభ్యర్థిని ఎన్నుకునే ఓటుహక్కు సిద్ధించాయి. అలాగే, మైనారిటీ వర్గాలయిన ముస్లిమ్‌లు, సిక్కులు, ఆంగ్లో ఇండియన్లూ, క్రైస్తవులూ – ఇలా అందరికీ ప్రత్యేక నియోజకవర్గాలు లభించాయి.**

దీంతో – సవర్ణహిందువుల ప్రాతినిధ్యం తగ్గిపోతుందన్న ఆందోళన వ్యక్తమయ్యింది. అప్పటికే జైల్లో ఉన్న గాంధీ ఈ విషయం తెలిసి మరింత ఆందోళన చెందాడు. హిందూసమాజంలో ఒకభాగమైన దళితులను వేరుచేయడం ద్వారా హిందూ సమాజాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారంటూ విమర్శించాడు.

ఆ ఆందోళనలో భాగంగానే – జైల్లోనే గాంధీ నిరాహారదీక్ష ప్రారంభించాడు. అంబేద్కర్ ప్రత్యేకనియోజక వర్గాలు కోరడం అనేది హిందూసమాజంలో సమైక్య భావాన్ని దెబ్బతీస్తుందన్న ప్రచారం ప్రారంభమయ్యింది. అయితే – అంబేద్కర్ గాంధీ దీక్ష గురించి వ్యాఖ్యానిస్తూ – దీనిని ఒక రాజకీయ ఎత్తుగడగా అభివర్ణించాడు.

అణగారిన జాతుల గురించి ఏ మాత్రం చింతించకపోగా, వారి నిర్ణయం గాంధీ ప్రాణాలకు ముప్పుతెస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఏంచెయ్యాలో అర్థంకాని అయోమయ పరిస్థితిలో అంబేద్కర్ సతమతమయ్యాడు. బ్రిటీష్ ప్రధాని కల్పించిన ప్రత్యేకహక్కులు ఉపసంహరించు కోవాల్సిందిగా ఒత్తిడి అధికమయ్యింది.

**మహాత్ములు పుడుతున్నారు, గిడుతున్నారు. కానీ అంటరానివారు మాత్రం అలాగే ఉండిపోతున్నారు. ఎన్నితరాలు మారుతున్నా అంటరానివారి జీవితాలలో అంధకారం తొలగే అవకాశమే లేదా? ఏంచేస్తే ఈ పరిస్థితి చక్కబడుతుంది? నిరంతరం ఇదే ఆలోచన అంబేద్కర్‌ది!**

గాంధీ ప్రాణాలకు ముప్పువాటిల్లిందనీ, అంబేద్కర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లయితే – గాంధీ దీక్షవిరమించగలరనీ, ఆయన ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత మీదేనంటూ అన్నివర్గాలనుంచీ ఒత్తిడి పెరిగిపోతుండటంతో **'గాంధీ ప్రాణాలు కాపాడుకోవడానికి అందరూ పూనుకోవాల్సిందేననీ, అయితే – ఆయన ప్రాణాలు కాపాడుకోవడం కోసం హిందూ సమాజంలో అత్యధిక శాతంగా ఉన్న నా ప్రజల భవిష్యత్‌కు వ్యతిరేకంగా ఏపనీ చెయ్యలేనంటూ' అంబేద్కర్ స్పష్టంగా చెప్పాడు.**

అనంతరం పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహారదీక్ష చేస్తున్న గాంధీని అంబేద్కర్ కలిశాడు. వారిద్దరి మధ్య జరిగిన సమావేశంలో చర్చలు రకరకాలుగా మలుపులు తిరిగాయి.

**గాంధీ ప్రాణరక్షణ అనే మానవతాపరమైన ఒత్తిళ్ల మధ్య సాధించిన కొన్ని హక్కుల విషయంలో రాజీపడాల్సివచ్చింది.**

ప్రైమరీ, సెకండరీ ఎన్నికల విధానానికి ఆమోదం తెలిపాయి. ప్యానల్‌లోని సభ్యుల సంఖ్య, ప్రత్యేకస్థానాలు, అసెంబ్లీలోని స్థానాల అంశాలు పరిపరివిధాల చర్చించారు. ప్రైమరీ ఎన్నికలు పదేళ్ళతర్వాత తీసివేయ వచ్చుననీ, ప్రత్యేకస్థానాల విషయంలో 15సంవత్సరాల తర్వాత రిఫరెండం జరిపి నిర్ణయించాలని అంబేద్కర్ కోరాడు. ఈ విషయంలో వాదోపవాదాల మధ్య అయిదు సంవత్సరాలకు ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చాయి. అందుకు అంబేద్కర్ సమ్మతించలేదు. అసలు రిఫరెండం ప్రసక్తి లేకుండా ఒప్పందపత్రాలు తయారుచేసి, అత్యంతనాటకీయ పరిణామాల

మధ్య గాంధీతో, అటుపిమ్మట మిగిలిన వారితో సంతకాల కార్యక్రమం పూర్తిచేశాయి.

**ఇరువర్గాలూ కొంతమేరకు నష్టపోయాయి.**

**అదే సమయంలో ఇరువర్గాలకూ కొంతలాభమూ జరిగింది.**

పూనా ఒప్పందం తర్వాత నిమ్నజాతులవారితో సహపంక్తి భోజనాలు, వారికి యజ్ఞోపవీత ధారణం, నిమ్నజాతుల యువకులకు హిందూమహిళలు వీరతిలకం దిద్దడం, అక్కడక్కడా దేవాలయప్రవేశాలు– వంటి కార్యక్రమాలు దేశంలో ముమ్మరంగా సాగాయి! జరుగుతున్న తతంగం అంతా గమనిస్తూనే ఉన్న అంబేద్కర్, మనం సాధించినది చాలా తక్కువనీ, **దేవాలయప్రవేశాలు ఆలింగనాలు సామాజిక స్థితి గతులను ఏ మాత్రం మార్చలేవనీ, రాజ్యాధికారం ద్వారా మాత్రమే అభివృద్ధి సిద్ధిస్తుందంటూ** హితవు చెప్పేవాడు. చేసిన పోరాటంతో చూస్తే సాధించిన ప్రయోజనం అతి స్వల్పమన్నవిషయం పూనా ఒప్పందవార్షికోత్సవ సమావేశంలో సమీక్ష జరిపినప్పుడు వెల్లడై అందరికీ నిరాశకల్గించింది. పూనా ఒప్పందంప్రకారం 18సీట్లు నిమ్నజాతులకు రావాలి. ఇది కొంతలోకొంత ఉపశమనం.

**మూడోరౌండ్ టేబుల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి! ఈ సమావేశాలకు బ్రిటిష్ ప్రభుత్వం అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో ఎటువంటి పురోగతి లేకుండానే సమావేశాలు ముగిశాయి.**

లండన్ నుంచి తిరిగి వచ్చిన అంబేద్కర్‌కు గాంధీ ఆహ్వానం అందింది. తనను కలిసిన అంబేద్కర్‌తో డా.సుబ్బరాయన్, రంగాఅయ్యంగార్ల బిల్లును సమర్ధించ వలసినదిగా గాంధీ కోరగా – అస్పృశ్యతను నేరంగా పరిగణించని ఈ బిల్లును తను సమర్ధించలేనని అంబేద్కర్ నిరాకరించాడు.

**దేశంలో వర్ణవ్యవస్థలు పోనంతకాలం వివక్ష ఇలాగే కొనసాగుతుందనీ, వర్ణవ్యవస్థ నిర్మూలనే తనకు సమ్మతమంటూ అంబేద్కర్ స్పష్టంచేశాడు.**

**వర్ణవ్యవస్థను కాదనలేని స్థితిలో గాంధీ, వర్ణవ్యవస్థను అంగీకరించని స్థితిలో అంబేద్కర్ సమావేశం ఏ స్పష్టతలేకుండానే ముగిసింది. రంగా అయ్యంగార్ బిల్లు అమలుకు నోచుకోకుండానే మూలపడింది.**

ఇదిలా వుంటే 1933 మార్చిలో బ్రిటిష్ ప్రభుత్వం ఒక శ్వేతపత్రం విడుదలచేస్తూ – భారతరాజ్యాంగ ప్రణాళిక రచనగురించి కొన్ని సూచనలు చేసింది. దీన్ని పరిశీలించేందుకు ఏర్పాటైన ఉపసంఘంలో అంబేద్కర్ కూడా సభ్యుడుగా నియమితు డయ్యాడు. ఇందుకోసం ఆయన లండన్ పయనమయ్యాడు.

భారతరాజ్యాంగ ప్రణాళికారచనకు సంబంధించి బ్రిటీష్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై లండన్‌లో చర్చజరిగింది. ఈ సభలో మాట్లాడుతూ శ్వేతపత్రంలోని లోటుపాట్లపై అంబేద్కర్ సమగ్రంగా విశ్లేషించాడు.

**హిందూసమాజంలో అసమానతల వల్లనే దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని కోరుకుంటున్నామనీ, కులవివక్షను మరచి హిందువులు సామరస్యంగా వ్యవహరించినట్లయితే – నిమ్నజాతులు సమగ్ర సమాజాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించగలరని అంబేద్కర్ చెప్పడం సమావేశంలో పాల్గొన్న మిగిలిన సభ్యులందరినీ ఆకట్టుకుంది.**

ఇదిలా ఉంటే – అంతకు ముందు జరిగిన పూనా ఒప్పందానికి వ్యతిరేకంగా తమకేదో అన్యాయం జరిగిపోతోందంటూ భారత్‌లో సవర్ణహిందువులు ఆందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

**'ఒప్పందం కుదిరే సమయంలో అందరికి నచ్చిన అంశాలే ఇప్పుడు నచ్చలేదనడం వెనుక అసలు ఆంతర్యమేమిటో అది వారికే తెలియాలి...'**

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం ఎంతముఖ్యమో... అగ్రవర్ణాల ఆరళ్ళకు గురౌతూ చీకటివాకిట చిక్కడిన నిమ్నజాతుల జీవనస్థితిగతులు అభివృద్ధి చెందడం అంతకన్నా ముఖ్యంగా భావించిన అంబేద్కర్ తయారవుతున్న రాజ్యాంగం ముసాయిదా ప్రతిరచన జరిగే తీరును నిశితంగా పరిశీలించడం ప్రారంభించాడు.

## కాలేజీ ప్రొఫెసర్

**దళితుల సమస్యలను అధ్యయనంచేస్తూ, దళితవర్గాల్లో పొడచూపుతున్న చిన్నచిన్న వివాదాలను ఏవర్గానికీ ఆత్మాభిమానం దెబ్బదినకుండా పరిష్కరిస్తూ, వారి మధ్య**

**సమన్వయం సాధిస్తూ... ఎప్పుడూ పనిఒత్తిడిలో ఉండే అంబేద్కర్ ఆహారనియమాలు అస్సలు పాటించకపోవడంతో ఆయన ఆరోగ్యం స్వల్పంగా దెబ్బతింది.**

ఆరోగ్యం కొంచెం కోలుకోగానే న్యాయవాదవృత్తిని కొనసాగిస్తూనే చదివిన చదువుకు సార్ధకత ఉండాలన్న ఉద్దేశంతో 1934 జూన్‌లో బొంబాయి కాలేజీలో పార్ట్‌టైం ప్రొఫెసర్‌గా చేరాడు. నిజంచెప్పాలంటే –

**ఆయన చదివిన చదువుకు అది తగిన పనికానప్పటికీ, భారత రాజ్యాంగ ప్రణాళికారచనకు సంబంధించి మరిన్ని చర్చలు జరిగినట్లయితే – వాటికి తను తప్పక హాజరుకావలసి ఉంటుంది కాబట్టి, పూర్తి కాలపు ప్రొఫెసర్ ఉద్యోగానికి అంబేద్కర్ ప్రాధాన్యత ఇవ్వలేదు.**

సరిగ్గా అదే సమయంలో – తను సేకరించిన అమూల్య గ్రంధాలను భద్రపర చేందుకు వీలుగా ఒక ప్రత్యేకభవనం 'రాజగృహం' నిర్మించుకుని తన నివాసాన్ని కూడా అక్కడే మార్చుకున్నాడు.

## భార్యావియోగం

**సుమారు 27సంవత్సరాలపాటు తనతో జీవితాన్ని పంచుకుని, తన కష్టసుఖాల్లోనే కాదు, ఆగర్భదరిద్రంలోనూ తనకు తోడునీడగా నిలచిన అర్ధాంగి అకాలమరణం అంబేద్కర్ జీవితంలో కోలుకోలేని విషాదం!**

అతిచిన్న వయస్సులో వివాహం కావడం, వివాహమైన వెంటనే ఉన్నత చదువుల కోసం పెనిమిటి విదేశాలకు వెళ్ళడం, అమెరికా, లండన్ తదితర విదేశాల్లో సుదీర్ఘ కాలం చదువుకుని విద్యావంతుడై స్వదేశానికి తిరిగివచ్చిన భర్త, అస్పృస్యతా జాఢ్యానికి సతమతమవుతున్న నిమ్నజాతుల జీవితాలలో కొత్త వెలుగుకోసం నిద్రాహారాలుమాని సభలు సమావేశాలతో కాలంగడిపేస్తుంటే – ఆయన ఆరోగ్యంకోసం నిరంతరం ఆమెకు ఆందోళనే...!

ఫలితంగా ఆమె ఆరోగ్యం దెబ్బతినడంతో –

**1935 మేనెలలో రమాబాయిమరణించింది. హిందూ మత విధానాలను అమితంగా ఇష్టపడే రమాబాయి మరణానంతరం ఉత్తర క్రియలన్నీ హిందూ మతధర్మప్రకారమే నిర్వర్తించడం విశేషం.**

## స్తబ్ధమైన జీవితానికి కొత్తచైతన్యం

**ఒకవైపు దళిత సోదరుల సమస్యలు, మరోవైపు క్షణక్షణానికీ మారుతున్న రాజకీయ ఎత్తుగడలు, ఇంకొకవైపు భార్య అనారోగ్యంతో సతమతమవుతున్న అంబేద్కర్‌కు కాస్తంత ఊరటనిచ్చినది న్యాయకళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలే!**

1935 ఏప్రిల్‌లో అంబేద్కర్‌ను ప్రభుత్వ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఒకప్పుడు ప్రాథమిక పాఠశాలలో చదువుకోవడానికే నానా అగచాట్లు పడిన దళిత యువకుడు అస్పృశ్యతా బంధనాలను చేధించుకుంటూ ఒక్కొక్క మెట్టే ఎక్కి అఖండవిజ్ఞానంతో భాసిల్లడమేకాకుండా రేపటితరానికి న్యాయంచెప్పగల మేధావులను తీర్చదిద్దడానికి నియుక్తుడవ్వడం న్యాయవిద్యకే కొత్తశోభ చేకూర్చినట్లయ్యింది!

**విద్య మార్కుల కోసమో.. ఉద్యోగాల కోసమో కాకుండా ధర్మాధర్మ విచక్షణ తెలిపేదిగా ఉండాలనేది అంబేద్కర్ అభిమతం!**

**సమసమాజ నిర్మాణానికి యువతరాన్ని సంసిద్ధుల్ని చెయ్యాలన్న సదుద్దేశంతో మిగిలిన అన్ని విషయాలను కాస్తంత పక్కనపెట్టి న్యాయవిద్యలో సంస్కరణలను చేపట్టాడాయన. అది చూసిన అనేకమంది అంబేద్కర్ రాజకీయాలనుంచి తప్పుకుంటున్నాడని బాహాటంగానే గుసగుసలాడుకున్నారు.**

తన పూర్తికాలాన్ని విద్యాసేవకు కేటాయించాలని అంబేద్కర్ అనుకున్నప్పటికీ –

**రేపటిచరిత్రను సువర్ణాక్షరాలలో లిఖించాల్సిన కారణజన్ముడు సాదాసీదా మాస్టారిలా కాలంగడపడం ఉన్నాడోలేదో తెలియని ఆ దేవుడికి కూడా ఇష్టంలేనట్లుంది...! విధి ఆయన్ను రాజకీయాలవైపు తిరిగి నడిపించింది.**

ఫలితంగా - 1938 మే నెలలో తాను చూస్తున్న లా కళాశాల ప్రిన్సిపల్ బాధ్యతల నుంచి వైదొలగి రాజకీయ సంస్కరణకు అంబేద్కర్ నడుం బిగించాడు.

## పుకార్ల ప్రహసనం

**అంతా సజావుగా జరిగిపోతే చెప్పుకోడానికేమీ ఉండదు! అంబేద్కర్ లాంటి మహావ్యక్తుల జీవితాలు నల్లేరుమీద బండిలా అస్సలు సాగవు! అందుకు నిదర్శనమే మతం మార్పిడి పుకారు!**

అంబేద్కర్ మతం మార్చుకోబోతున్నారన్న వార్త దావానలంలా దేశమంతా వ్యాపించింది! 1935 అక్టోబర్‌లో యౌలా మహాసభ జరగబోతోందనీ, ఆ సభలో అంబేద్కర్ తను మతం మార్చుకోబోతున్నానన్న వార్తను ప్రకటిస్తారనీ ప్రచారంలోకి వచ్చేసింది. అది నిజమో... అబద్ధమో... ఎవ్వరికీ తెలియదు...! అసలు నిజం తెలిసిన మహామనిషి వినవస్తున్న ఈ పుకార్లను ఔననీ.. కాదనీ.. ఏమీ చెప్పకుండా 'ఔనా...' అని గుంభనంగా చెప్పి ముసిముసిగా నవ్వుకోవడం అయినవాళ్ళు అదే నిజమని నమ్మి పుకార్లను ఇంకొంచెం విస్తృతంగా ప్రచారం చేశారుకూడా...! ఏదైతేనేం... రావాల్సిన యౌలా మహాసభలు రానే వచ్చాయి...!

## పుకార్లను ఖండించని అంబేద్కర్

**1935 అక్టోబర్‌లో యౌలా మహాసభలు ప్రారంభమయ్యాయి! సభలో అంబేద్కర్ ఏంచెబుతాడా? అని అందరూ ఎదురుచూశారు. ఇదంతా ఆయనకు తెలుసు...!**

పుకార్లను విస్తృత ప్రచారం చేసిన వార్తాపత్రికలకు కొద్దిపాటి సస్పెన్స్‌ను అందించాలనుకున్నారో ఏమోగానీ - మతం మార్పిడి అంశాన్ని ఆచితూచి మాట్లాడారు.

**అంటరానివాడిగా తనను అసహ్యంచేస్తున్న హిందూమతం అంటే తనకు సదభిప్రాయం లేకున్నప్పటికీ, హిందూమతంలో పుట్టిన తాను మరో మతం తీసుకునే అత్యవసర పరిస్థితి ఇంకా రాలేదనీ, ఆ పరిస్థితే ఏర్పడి**

**నప్పుడు లోతుగానే ఆలోచిస్తానన్నట్లుగా నర్మగర్భంగా చెప్పి, అవసరమై నప్పుడు సందర్భానుసారం నిర్ణయం తీసుకుంటానని భవిష్యత్ ప్రణాళికను సూచనప్రాయంగా చెప్పారాయన.**

ఆయన మతం మారతారా? లేదా? అనేది ఎవ్వరికీ అర్ధంకాలేదు. ఎవరికి కావలసిన అర్ధంవారు అన్వయించుకుంటూ అటు హిందువులు, ఇటు దళితులు తీవ్రంగా చర్చించుకోవడం అప్పట్లో చర్చనీయాంశమే అయ్యిందని చెప్పవచ్చు. మతమార్పిడి అంశాన్ని పతాకశీర్షికగా ప్రచురించాలని ఆశపడ్డ పత్రికలు అంబేద్కర్ ప్రసంగపాఠాన్ని ఏవిధంగా నిర్ధారించుకోవాలో అర్ధంకాక కాస్తంత గందరగోళంలోనే పడ్డాయి మరి!

**మతమార్పిడి గురించిన చర్చలు చాలాకాలమే కొనసాగాయి. ఆ మరుసటి సంవత్సరం అంటే 1936 జనవరిలో పూనాలో జరిగిన దళితుల సమావేశాల్లో ఈ అంశమే ప్రధానచర్చగా సాగింది.**

హిందువుగా పుట్టిన తాను హిందూ మతాన్ని వదులుకోవాలని అనుకోటంలేదనీ, అయితే హిందూమతంలో వేళ్ళూనుకుపోయిన కులవ్యవస్థ సమూలంగా రద్దుకావాలన్నదే తన కోరికనీ స్పష్టంగా చెప్పిన అంబేద్కర్ ఏ మార్పూరాని పక్షంలో హిందూమతం వీడి మరో మతం స్వీకరించేందుకు సైతం వెనుకాడనని ఖండితంగా చెప్పిన విషయం బహిరంగ రహస్యమే!

**చెప్పినమాటనే పదేపదే చెబుతుంటే -**

**కొద్దికాలానికి ఆ మాట మనసుపై ప్రభావం చూపుతుందని**

**పెద్దలు ఊరికే అనలేదేమో...?**

**సరిగ్గా అదే జరిగింది అంబేద్కర్ విషయంలో!**

మతం మార్పిడి గురించి పదేపదే పత్రికల్లో వార్తలుగా రావడం, ఊరూరా.. వాడవాడా... ఇదే విషయాన్ని విస్తృతంగా చర్చించుకోవడం అంబేద్కర్ దృష్టిని దాటిపోలేదు. ఆయన మనసులోనూ మతమార్పిడి అంశం ఓ ఆలోచనగా మొదలయ్యింది.

## ఎవరేమనుకున్నారు...?

**మతం మార్పిడి విషయమై తన వాళ్ళేమనుకుంటున్నారో అంబేద్కర్‌కు తెలుసుకోవాలనిపించింది.**

అందుకే – 1936 మే 30,31 తేదీలలో బొంబాయి సమీపంలోని దాదర్‌లో మహర్ కులస్తులను మాత్రం ప్రత్యేకంగా ఆహ్వానించి సభజరిపాడు.

**మతం, మతవిధానం, ప్రాధాన్యం – వంటివిషయాలపై తన వాళ్ళతో చర్చించిన తర్వాతే ఏనిర్ణయమైనా తీసుకోవాలన్నది ఆయన ఆలోచన...! అంతవరకూ ఒంటెత్తు పోకడలతో సాగిపోతున్న మనిషికి – సంఘజీవనం అంటే అందరూ కలసి చర్చించి, నిర్ణయించుకుని, అందరొక్కటై పురోగమించడం అంటూ చాటిచెప్పినట్లుయ్యిందన్నమాట!**

ఈ సమావేశంలో అంబేద్కర్ ఏం చెబుతాడా? ఎటువంటి నిర్ణయం ప్రకటిస్తాడా? ఏ మత విధానం పట్ల మొగ్గుచూపుతాడా? అని కొందరు ఎదురు చూస్తే..., తమ మతంలోకి చేరుతున్నట్లుగా ప్రకటిస్తాడేమోనన్న ఆసక్తితో ఎదురుచూశారు కొంత మంది ఆశావహులు...!

**అన్ని మతాలనూ, మతగ్రంథాలనూ, మతవిధానాలనూ కూలంకశంగా అధ్యయనం చేసిన అంబేద్కర్ మతవిధానాలలో ఉండే లోపాలపై ఆయన వివరాణాత్మక విశ్లేషణను వినాలని సంస్కరణవాదులు ఉత్సాహపడ్డారు...!**

నిజంచెప్పాలంటే – తనవారి అభిప్రాయాలు తెలుసుకోవాలని అంబేద్కర్ సభ ఏర్పాటుచేస్తే... అంబేద్కర్ నుంచే మరింత సమాచారం గ్రహించాలనీ, ఆయన నిర్ణయమే తమ నిర్ణయంగా ప్రకటించాలని నిమ్నకులస్తులు ఆరాటపడ్డారు. అంబేద్కర్‌గా మారిన అంబావడేకర్ చిన్నప్పటి గురువుగారైన 'అంబేద్కర్' (మతం కన్నా మానవత్వమే మిన్నగా భావించే బ్రాహ్మణ కులస్తులు) లాంటివారు – ఈ సభ వల్లనైనా తమ హిందూమతంలోని కొన్ని లోటుపాట్లు సవరించుకునే మంచిరోజు రావాలని ఆకాంక్షించారు.

**తమ స్వార్థంకోసం మతవిధానాలకు వక్రభాష్యం చెబుతూ, తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకునే కొందరు మతపెద్దల దాష్టీకానికి చరమగీతం పాడాలనీ, సర్వ**

**మానవ సమానత్వాన్నీ సౌభ్రాత్రతనూ ప్రబోధించిన వేదాంతసారానికి నిజమైన అర్థం అందరూ గ్రహించాలనీ మానవతావాదులు మనస్ఫూర్తిగానే కోరుకున్నారు.**

## మనిషి కోసమే మతం...

**మనిషి మనిషిలా బతకడం కోసం మతాన్ని ఏర్పాటు టేసుకున్నాడేతప్ప.. మతం మనిషిని సృష్టించలేదనీ, అటువంటి మతం కోసం మనిషి తోటి మనిషిని మనిషిగా గౌరవించకపోవడం మానవత్వానికే మాయనిమచ్చని అంబేద్కర్ తన ప్రసంగంలో అభిప్రాయపడ్డాడు.**

మతాలు, మతవిధానాలు, మతపెద్దల పోకడల గురించి అంబేద్కర్ సున్నితంగా, స్పష్టంగా విశ్లేషించాడు. దాదర్ మహాసభల్లో సుదీర్ఘప్రసంగం చేసిన అంబేద్కర్ కొన్నిసార్లు మత గ్రంధాల సారాంశాన్ని వక్రీకరిస్తున్న మతపెద్దల దురహంకారాన్ని చాటా ఘాటుగా కూడా ఎండగట్టారు.

**మనిషి మనిషిగా బతికే అవకాశాలను దూరంచేస్తూ, తరతరాలుగా సంఘజీవనానికి పనికిరాని అస్పృశ్యులుగా, చిత్రించి వారిని కట్టుబానిసలుగా మార్చేసిన విధివిధానాల లోపాలను, మతగ్రంధాలలోని అసలు సిసలు హితవాక్యాలనూ అంబేద్కర్ నోటవింటుంటే – తాము నిత్యం పూజించి, ఆరాధించి, అమలుచేస్తున్న గ్రంధాల అసలు సారాంశం తమ కస్సలు అర్ధమేకాలేదన్న నిజం కొందరు మతపెద్దలకు అప్పుడే తెలిసివచ్చింది.**

చదువుకునే అవకాశమే లేని కులంలో పుట్టి, చదువుకునే అవకాశాలకోసం ఆరాటపడి, దొరికిన ఏ చిన్న అవకాశమైనా అదే మహద్భాగ్యంగా భక్తిశ్రద్ధలతో సద్వినియోగం చేసుకునిచ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడమే కాకుండా, వివిధ మతగ్రంధాలతో బాటు మానవ ధర్మశాస్త్రాన్ని సైతం ఔపాసనబట్టి మతపెద్దలకే మతధర్మాలను వివరించడం చాలామందిని ఆశ్చర్యపరచడమేకాదు, వారికి నోటమాట లేకుండా చేసింది. విజ్ఞానం ఒక్కరి సొత్తు కాదన్న అసలు నిజం అందరికీ అర్ధమయ్యింది!

ఐహిక ప్రపంచంలోని మనిషిగా బతికే హక్కు ఈ మత విధానాలవల్ల లభ్యం కానప్పుడు మరణానంతర ప్రపంచాన్ని ఏ విధంగా నమ్మాలంటూ సూటిగా ప్రశ్నించన

అంబేద్కర్ మాటలు వింటున్నప్పుడు... అయన మానసికంగా ఎంతటి చిత్రవధ అనుభవించాడో సులభంగా అర్ధంచేపుకోవచ్చు.

## ఎవరి ప్రయత్నాలు వారివి...!

**అంబేద్కర్ మతమార్పిడి అంశం దేశంలోనే పెద్ద సంచలనం రేపుతోంది! అంబేద్కర్ ఒక్కడే అయితే - ఆయన ఏ మతం పుచ్చుకున్నా ఎవ్వరూ ఆలోచించే వారే కాదేమో...!**

అంబేద్కర్ మాటనే వేదంగా.. అంబేద్కర్ బాటనే జీవితగమ్యంగా భావించే వేలాది నిమ్నజాతీయులైన హిందువులు - అంబేద్కర్ ఏ మతం పుచ్చుకుంటే ఆ మతం పుచ్చుకోదడానికి సిద్ధంగా ఉన్నారు. దాంతో మిగిలిన మతాధిపతులకు అంబేద్కర్‌ను తమ మతంలోకి ఆహ్వానించడం ద్వారా భారతదేశంలో తమ ప్రాబల్యం విశేషంగా పెంచుకోవచ్చునని ఆశపడిన మాట నిజం! తనను ఆహ్వానిస్తున్న వివిధ మతధిపతుల నుంచి తప్పించుకోడానికి చాలా అవస్థ పడాల్సివచ్చింది అంబేద్కర్‌కి!


**ఏ మతం తీసుకోవాలన్న విషయంలో అంబేద్కర్‌కు స్పష్టమైన నిర్ణయం లేకున్నప్పటికీ - తాను తీసుకునే నిర్ణయం హిందూమతానికీ, భారతదేశానికీ ఏవిధమైన నష్టమూ కలుగజేయకుండా ఉండాలన్నది ఆయన అభిమతం!**

క్రైస్తవమతం తీసుకుంటే విదేశీసహాయం అందుతుంది. బ్రిటీష్ ప్రభుత్వం సంతోషిస్తుంది. ఇస్లాంమతం తీసుకున్నా వ్యక్తిగతంగా తననూ, తనవారికీ కూడా మంచి ప్రయోజనమే అందిస్తుంది. అయితే - ఈ రెండు మతాలవల్లా భవిష్యత్‌లో హిందూమతానికి ప్రాభవం తగ్గగలదనీ, అందువల్ల ఈ రెండు మతాలూ కాకుండా మరో మతమైతే బావుంటుందని ఒక చిన్న ఆలోచనవచ్చింది. సిక్కుమతం తీసుకోవడం కొంతమంచిదే కాగలదనిపించింది. ఎందుకంటే - పూనా ఒడంబడిక ప్రకారం ఈ నియోసిక్కులను నిమ్నజాతులుగానే పరిగణించవచ్చు. తద్వారా హిందూమతానికి ఎటువంటి హాని జరగకుండా చూడవచ్చు. ఇదే విషయమై - హిందూ మహాసభ ఉపాధ్యక్షుడైన డా. మూంజీ, అంబేద్కర్‌ల మధ్య చాలా కాలంపాటు ఉత్తరప్రత్యుతరాలు



Dr.Ambedkar with his family members at Rajgraha, his residence in Hindu Colony, Dadar (Bombay). From left - Yashwant (Son), Dr.Ambedkar, Smt.Ramabai (Wife), Smt. Laxmibai (Wife of his elder brother, Balaram), Mukund (Nephew) and Dr.Ambedkar's favourate dog, Tobby.

Dr.Ambedkar, Labour Member seen with Lord Wevell. (In Center) and other members of Viceroy's Executive Council. (2 July 1942)





Dr.Ambedkar with his followers during a meeting at Nashik. On his right Dr.Dadasaheb Gaikwad and at the back Madakebuwa and R.D.Bhandare are seen.



Labour Minister pays visit to the Slums of Mines Labours to listen their grievances.(1942)



Dr.Ambedkar observing Rally of Samata Sainik Dal
established at Kamgar Maidan ,Parel, Mumbai.



Dr.Ambedkar with Professors of Government Law College, Bombay. (Sitting from left) Shri.A.A.Gyzee, T.N.Valavalkar, A.B.Vaidya and Dr.Ambedkar. (Standing) Shri.S.B.Jathar, M.S.Vakil, NHC Coyazee, L.F.Rodrigues, Smt.R.P.Karve, Registrar.



Dr.Ambedkar in grief standing near the dead body oh his dutiful & pious wife Smt.Ramabai who died on May27, 1935. His son Yashwant & nephew Mukund & other followers are seen.




Mahila Samaj honoured Dr. Ambedkar at Rajagraha on his appointment as Member, Governer General's Executive Council. (April 1942)



Dr.Ambedkar with Women delegates of the Scheduled Caste Federation during the Conference of the Federation on July8, 1942 at Nagpur.

Reception to Sir.Cripps. Dr.Ambedkar standing next to Shri.K.M.Munshi.



కూడా నడిచాయి. అంబేద్కర్ ఆలోచనలు, ప్రతిపాదనలపై మిగిలిన నాయకుల అభిప్రాయాలు సేకరించడం మంచిదని డా.ముంజీ సూచించడంతో కొందరు నేతలకు అంబేద్కర్ ప్రకటన ప్రతులు పంపి, మీ అభిప్రాయం తెలియజేయమంటూ డా.మూంజీ కోరాడు. ఇలా ప్రకటన ప్రతులు అందుకున్న వారిలో డా. ఎం.సి.రాజా, డా.ముంజీ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనప్రతులు పత్రికలకు విడుదల చేశాడు. ఈ చర్చవెనుక గాంధీ హస్తముందన్న ఆరోపణలూ ఉన్నాయి. అంబేద్కర్ ప్రకటన ప్రతుల విడుదలతో దేశంలో చెలరేగిన దుమారం అంతాఇంతాకాదు. సందట్లో సడేమియా అన్నట్లుగా గాంధీపై వచ్చిన ఆరోపణకు అంత ప్రాధాన్యత లభించలేదు. ఇదిలా ఉంటే అంబేద్కర్ సిక్కుమతం స్వీకరిస్తున్నాడంటూ పుకార్లు షికార్లు చేయడంతో ఆ వార్తల్ని నమ్మిన కొందరు సిక్కుమతం స్వీకరించేశారు. మతమార్పిడి విషయంలో తొందరపాటుతనం పనికిరాదంటూ అంబేద్కర్ హితవు చెప్పాడు. అయితే – అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది.

**ఏది ఏమైనప్పటికీ – అంబేద్కర్ మతమార్పిడి అంశం హిందూమతంలో కొన్ని మార్పులకు కారణమయ్యింది. దసరావేడుకలలో నిమ్నజాతులు కూడా పాల్గొనచ్చు నంటూ మైసూరు ప్రభుత్వం అనుమతినివ్వగా, తిరువాన్కూరులో 1600 దేవాలయాలలో నిమ్నజాతులకు ప్రవేశార్హత లభించింది. ఇది కొంత ఊరట!**

## భారతంలో ఎన్నికల సంబరం

**భారతదేశంలో ఎన్నికలకు సిద్ధమయ్యింది. ప్రొవిన్షియల్ అటానమి ప్రారంభం కావాలసిఉన్న నేపథ్యంలో 1937లో జరుగనున్న ఎన్నికలకు భారతదేశంలో వివిధ రాజకీయపార్టీలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.**

దేశానికి పూర్తి స్వాతంత్ర్యం లభించకున్నా పరిపాలనాపరమైన విధాననిర్ణయాలలో తమజాతివారికి ఎటువంటి హానీ జరగకుండా చేసేందుకు చట్టసభలో తగినంత ప్రాధాన్యత చాలా అవసరమని భావించిన అంబేద్కర్ 1936లో స్వంతంగా ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ప్రారంభించాడు.

**కేవలం తమ నిమ్నజాతులకే కాకుండా దేశంలోని ప్రజలందరికీ మంచి జరగాలన్న ఆకాంక్ష ఈ పార్టీ ఆశయాలతో వ్యక్తమయ్యింది. ప్రజల దారిద్ర్యానికి మూలకారణాలను రూపుమాపి వారి జీవనస్థితిగతులను మెరుగుపరచాలన్నది ప్రధానలక్ష్యంగా, నిరద్యోగ నిర్మూలన, అందరికీ విద్యావకాశాలు, సాంకేతిక విద్యాభివృద్ధి, పారిశ్రామి కాభివృద్ధి, వ్యవసాయరంగ ఉన్నతి, క్రిందిమధ్యతరగతుల వారికి కనీస వసతిసౌకర్యాలు కల్పించడం తమ పార్టీ ప్రణాళికగా ప్రకటించారు.**

ఈ ఎన్నికల్లో అంబేద్కర్ పార్టీ 17స్థానాల్లో పోటీచేయగా 15స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేటంత మెజారిటీ లభించినా తాము కోరిన హామీపత్రం గవర్నర్ ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకురాలేదు. ఫలితంగా గవర్నర్ మధ్యంతర మంత్రివర్గాన్ని ఏర్పాటుచేశాడు. కొద్దికాలాల అనంతరం మధ్యంతర ప్రభుత్వస్థానంలో కాంగ్రెస్ అధికారాన్ని స్వీకరించింది.

మంత్రుల జీతాల విషయం 1937 ఆగస్టలో అసెంబ్లీలో చర్చకు వచ్చినప్పుడు అంబేద్కర్ దీన్నితీవ్రంగా వ్యతిరేకించాడు.పరిపాలనా యంత్రాంగంనిర్మలంగా స్వచ్ఛంగా ఉండాలంటే ఇలాంటి ఆడంబరాలు ఉండకూడదని ఆయన అభిప్రాయ పడ్డారు.

## శ్రామిక నాయకుడు

**అంబేద్కర్ ప్రతినిమిషం కాయకష్టం చేసి పొట్టనింపుకునే కార్మికుల శ్రేయస్సు కోసం ఆలోచన చేసేవాడు.అప్పటిలో కొంకణ ప్రాంతంలోని ఖోటీ పద్ధతి పోవాలని అంబేద్కర్ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాడు. వ్యవసాయ కార్మికులు, రైతుల కోసం అసెంబ్లీలో చర్చలు తీసుకువచ్చిన మొదటి వ్యక్తి అంబేద్కర్.**

అప్పటి సోషలిస్టులు జమిందారితనం, పెట్టుబడిదారీవ్యవస్థలు నశించాలని బిల్లుకు సంఘీభావం ప్రకటించలేదు. ఇప్పటి వ్యవసయ కార్మికులు కూడ లబ్ధి పొందేలా అంబేద్కర్ ఊహించడం గమనర్హం. ఈ విషయంపై ఎంతోమందిని అంబేద్కర్ ఉత్తేజపరిచాడు. ఠానా, కొలాబా, రత్నగిరి వంటి ప్రాంతాల నుంచి రైతులతో గొప్ప

ఊరేగింపు ఏర్పాటుచేసి బీదరైతుల సమక్షంలో మూడు ఊరేగింపులు ఏర్పాటుచేసి వేరు వేరు సభలు నిర్వహించారు. ఇరవైమంది నాయకులు తమ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అంబేద్కర్ చుట్టుపక్కలవారు ఎంత కుట్రపన్నినా, ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా, తన లక్ష్యం ప్రజల భవిష్యత్ ప్రణాళికలపైనే పెట్టాడు.

అంబేద్కర్ చేసిన మహర్‌వతన్ల నిర్మూలనకు ఆందోళన 1927 నుండీ నిరాఘాటంగా కొనసాగి 1959లో విజయవంతమైంది. ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో వ్యూహాత్మక ఆలోచనలు చేసిన అంబేద్కర్, శ్రామికులందరూ ఏకమైనప్పుడే సమస్య మూలాలకు తగిన పరిష్కారం దొరుకుతుందని ఆకాంక్షించాడు. అంబేద్కర్ వీలైనంత సమయం దళితుల అభివృద్ధి, సమాజంలో వారికి సముచిత స్థానం లభించాలన్నదే ఆయన ప్రసంగసారాంశంగా ఉండేది. అప్పటి దళితుల జీవన సరళి మారడం కోసం బ్రిటీష్ లేబర్ పార్టీ పద్ధతిలో భారతదేశంలో లేబర్ పార్టీ ఆవస్యకత ఉందని తెలియజేశారు. ఈ విధంగా ఆయన ఎన్నో ఊళ్ళు పర్యటిస్తూ, ప్రసంగాలు ఇస్తుండగా నిపాని అనే ప్రాంతంలో యాభై ఎడ్ల కూర్పుతో తయారుచేయబడిన బండితో ఆయనను ఒక మైలు దాకా ఊరేగించి సత్కరించారు.

**ఈ క్రమంలో దళితనాయకుడు మంత్రివర్గంలో ఉండడం వారి శ్రేయస్సుకు మంచిదని వారిలో నాయకత్వ బాధ్యతను గుర్తుచేశాడు. అలాగే దళితుల పురోగతిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం వారికి బంజరుభూములను ఇవ్వాలని చెప్పాడు. ప్రభుత్వో ద్యోగుల నియమితులలో కూడా వారికి కొంత శాతం కేటాయించడం ద్వారా అభివృద్ధి కానవస్తుందని అభిప్రాయపడ్డాడు.**

అప్పటి ఎన్నో రాజకీయ అంశాలకు మంచిచెడులను ఆయన వివరించాడు. అప్పటిలో 'బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి విముక్తి కన్నా ప్రస్తుత సమాజంలోని పెట్టుబడిదారీ వ్యవస్థని పోగొట్టడమే తన ఆశయం'గా చెప్పాడు.

**ప్రజలలో సమానత్వధోరణి వచ్చాకనే దేశాభివృద్ధి కుదురుతుందని, అలాకాక ప్రజాస్వామ్యం అవలంబించినా దేశానికి వచ్చే లాభంలేదని అంబేద్కర్ చెప్పాడు. వీటి ద్వారా అంబేద్కర్ ఎంత విశ్లేషణాత్మకంగా ఆలోచించాడో అర్థం చేసుకోవచ్చు.**

పండరీపూర్, షోలాపూర్, మాసూర్‌లలో ఆయన ప్రసంగాలు చేస్తూ '

**ప్రపంచంలోని ఇతర దేశాలకూ, భారతదేశానికి చాలా తేడా ఉంది. పదిమంది చేసే పద్ధతికి భిన్నంగా ఒక్కడేదైనా చేస్తే ఇతర దేశాల్లో అతన్ని పిచ్చివానిగా జమచేస్తారు. భారతదేశంలో మాత్రం అతడు మహాత్ముడో, యోగిపుంగవుడో అవుతాడు.' అని గాంధీ గురించి ఆయన అభిప్రాయాన్ని వెల్లడించారు.**

ఆయన ఎన్నో ఊళ్ళు సంచరిస్తూ బావ్లా గ్రామంలోని ప్రజల కష్టాలను చూసి చలించిపోయాడు. అందరూ సోదరభావంతో, ఆత్మబలంతో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. 1938లో కోర్టు పనికోసం నాగ్‌పూర్ వెళ్ళిన అంబేద్కర్‌ను చూడడానికి వచ్చిన వందలాది జనాలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా కురిసినప్పటికీ ప్రజలు ఏమాత్రం చెదరకుండా ప్రసంగం విన్నారు. ఆయన ఇచ్చే ప్రతి ప్రసంగానికి వేల సంఖ్యలో జనాలు వచ్చేవారు. 1938 మే 14న కంకౌలీలో జరిగిన సభాస్థలానికి 'అంబేద్కర్ నగర్' గా పేరుపెట్టారు. ఆ సభకు దాదాపు 1500 మంది జనం వచ్చారు. చట్టబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ అభివృద్ధి పథాన్ని చేరుకోవాలని ఆనాడు ఆకాంక్షించారు. ఖోటీ నిర్మూలనకై వేసిన బిల్లు 10నెలల నుండి వాయిదా పడుతోందని, ఒకవేళ అది తిరస్కరింపబడితే ప్రజలంతా ఏకమై పోరాడాలని విజ్ఞప్తి చేస్తూ రైతుకూలీలలో ఒకరు రాష్ట్రముఖ్యమంత్రి అవ్వాలని ఆయన ఆకాంక్షను తెలియజేశారు. ప్రజలకై అలుపెరగకుండా సభలు నిర్వహించడంతో ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. చివరకు ఆయన సభలలో కూడ మాట్లాడలేకపోయారు. 1938 డిసెంబర్ 30న అంబేద్కర్ అధ్యక్షతన హైదరాబాదు సంస్థానంలో జరిగిన మొదటి దళితజాతుల సమావేశం అదే. అక్కడి అస్పృస్యతాకష్టాలను చూసి వారికి స్వయంకృషితో ఆత్మగౌరవం పెంపోందించుకొమ్మని చెప్పారు.

## అగ్రవర్ణాల ఆధిపత్యం

**అసెంబ్లీలోనూ అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. వాదోపవాదాలలో చాలాసార్లు సంయమనం పాటిస్తూ తమ జాతి జనుల సంక్షేమమే లక్ష్యంగా శాసనసభలో జరిగే చర్చల్లో తన వాదన వివరించేవారు.**

ఒకసారి అసెంబ్లీలో నిమ్నజాతులను హరిజనులుగా పేర్కొనడంపై చిన్నపాటి వివాదమే జరిగింది. మెజారిటీ సభ్యుల అభిప్రాయం ప్రకారం 'హరిజనులు' అన్న పదమే ఉంచాల్సిరావడంతో సభనుండి అంబేద్కర్ వాకౌట్ చేశాడు కూడా.

**బ్రాహ్మణులు అంటే ఎటువంటి దురభిప్రాయమూ అంబేద్కర్‌కు లేకున్నప్పటికీ మిగిలిన కులాలకు ఏవిధమైన గుర్తింపు, హక్కులు లేకుండా చేశారన్నదే ఆయన ఆవేదన, ఆందోళన కూడా!**

ప్రజలంతా సమానమే అనీ, ఒకరు ఎక్కువ ఇంకొకరు తక్కువ అని ఏ శాస్త్రంలోనూ చెప్పలేదని, ఈ మనుషులే తమ స్వార్థంకోసం కొన్ని కులాలు ఎక్కువగా, కొన్ని కులాలు తక్కువగా అసమానతలను పెంచిపోషించారనీ, ఇప్పటికైనా ఈ విషయం మీద తగినంత శ్రద్ధ తీసుకుని మార్పు తీసుకురాకపోతే, భవిష్యత్ తరాలకు బతుకే శూన్యం అవుతుందని ఆయన భయపడేవాడు. ఏ సంఘమైనా ఉన్నతి సాధించాలంటే ప్రజల జీవనస్థితిగతులే అందుకు కారణం అవుతుందనీ, కొందరు ఎక్కువగా కొందరు తక్కువగా అసమానతల మధ్య జీవించే పరిస్థితులు ఉన్నప్పుడు సమాజం ఏవిధంగా అభివృద్ధి చెందగలదంటూ ఆయన ఆందోళన చెందేవాడు. ప్రజల ఆర్థిక జీవనస్థితి గతులు సమాజాభ్యున్నతిని సూచిస్తాయని అందుకే ప్రజలందరూ ఐకమత్యంగా, ఎక్కువ తక్కువలనే అభిప్రాయాలను విడనాడి అందరొక్కటై తమ జీవనస్థితిగతులను మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించేవాడు. బ్రాహ్మణులను ఇతర అగ్రకులాలను ఏనాడూ ఆయన విమర్శించేవాడు కాదు. విధానలోపాలను ఎత్తిచూపి ఎండగట్టడంలో ఏనాడూ వెనకడుగూ వేయలేదు.

**సమాజంలో అట్టడుగున ఉండిపోయి చదువుసంధ్యల్లేక పనిచేసుకునే అవకాశం లేక దుర్భరదారిద్ర్యంతో మగ్గుతున్న నిమ్నజాతులు శ్రమనే ఆయుధంగా చేసుకుని కష్టపడి పైకిరావాలనీ, నిమ్నజాతుల పిల్లలు దొరికిన ఏచిన్న అవకాశాన్నీ వదులు కోకుండా మంచి చదువులు చదివి విద్యావంతులు కావాలని ఆయన ఆకాంక్షించేవాడు.**

నిమ్నజాతులవారికి విద్యావకాశాల కల్పన, పని భద్రత, ఉద్యోగవకాశాలు ఆర్థిక సహాయం – తదితర అంశాలలో ప్రభుత్వపరంగా మంచి నిర్ణయాలు వచ్చేవిధంగా ఆయన అసెంబ్లీలో పోరాడేవాడు.

## తెల్లవాళ్లవల్ల మంచే జరిగింది

**అఖండ భారతం ఒకప్పుడు అనేకరాజ్యాల నిలయం. చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలు, పరగణాలు...! ఎవరి రాజ్యం వాళ్ళది, ఎవరి పాలన వాళ్లది, ఎవరి విధానాలు వాళ్లవి. ఒక్కొక్కళ్ళది ఒక్కొక్క చట్టం, ఒక్కొక్కళ్ళది ఒక్కోన్యాయం. ఒకచోట చలామణి అయ్యే నాణెం మరోచోట ఎందుకూ పనికిరాదు.**

ఎన్నో వందల ప్రభువులు ఎవరికివారు తమంతవారు లేరనుకుంటారు. తాము చెప్పిందే రైట్ అనుకుంటారు. సరిహద్దు తగాదాలు అతి సామాన్యవిషయం. ఎక్కడో చోట.. ఏదోమూల... కత్తులు కలుస్తూనే ఉంటాయి. కుత్తుకలు తెగుతూనే ఉంటాయి.

అటువంటి అల్లకల్లోల భారతాన్ని ఒక్క పాలన కిందకి తెచ్చి ఒక్క న్యాయాన్ని అమలు పరిచిన ఘనత తెల్లవాళ్ళకే దక్కుతుందని అంబేద్కర్ అభిప్రాయపడేవారు.

అయితే ఎందుకనో ప్రాంతాలలో సమానతలు సాధించిన తెల్లవాళ్ళు జాతుల మధ్య సమానతలు సాధించలేకపోయారని ఆయన విమర్శించాడు. ప్రపంచంలో ఇంకెక్కడా లేనంత అనాగరిక అణచివేతకు గురవుతున్న నిమ్నజాతుల ఉన్నతి తెల్ల వాళ్ళకు పట్టకపోవడం దురదృష్టం అంటూ కూడా ఆయన వ్యాఖ్యానించేవారు.

**వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో రైతన్నకు మేలు చేయడం అంటే మనకు మేలు చేసుకున్నట్లవుతుందన్నది అంబేద్కర్ అభిప్రాయం.**

అందుకే ఓసారి నాసిక్ సభలో మాట్లాడుతూ పన్ను రూపంలో ప్రభుత్వం వసూలు చేస్తున్న డబ్బు రైతుల దారిద్ర్యనిర్మూలనకూ, వారి భవిష్యత్ ప్రణాళికలకూ, చదువు సంధ్యలకూ, వినియోగించాలంటూ డిమాండ్ చేశారు.

## యుద్ధ వాతావరణం

**ప్రపంచమంతా యుద్ధ వాతావరణం నెలకొంది. హిట్లర్ విధానాలు నచ్చని ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీ తేల్చు కోడానికి సిద్ధమౌతున్నాయి. ఈ యుద్ధంలో తమకు సహకరించవలసినదిగా భారతీయ నాయకులపై బ్రిటన్ ఒత్తిడి తెచ్చింది.**

బ్రిటన్ తన యుద్ధ లక్ష్యాలను, ఇండియాపట్ల తన వైఖరిని స్పష్టం చేయాలంటూ భారతీయ నాయకులు డిమాండ్ చేశారు. యుద్ధానంతర నిర్ణయాలగురించి ఎటువంటి ప్రస్తావనా లేకుండా భారతీయుల మద్దతు సాధించాలని బ్రిటన్ సంప్రదింపుల పర్వం మొదలుపెట్టింది. తాము మాత్రమే దేశభక్తులమని తమకు మాత్రమే దేశం గురించి మాట్లాడే అర్హత ఉందని తనకై తానే ఊహించుకునే కాంగ్రెస్‌పెద్దలు కొంతమంది సంప్రదింపులకు ససేమిరా అన్నారు. యుద్ధవిషయంలో అంబేద్కర్ స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగిఉన్నారు.

**'నా వ్యక్తిగత జీవితంకన్నా దేశసంక్షేమమే నాకు ముఖ్యం. నాదేశ సమస్యకన్నా నా జాతి భద్రతే నాకు ముఖ్యం. నాజాతి భద్రతకు భంగం వాటిల్లుతుందన్న అనుమానం ఏ మాత్రం కలిగినా అటువంటి నిర్ణయాన్ని నేను సమ్మతించను' అంటూ అసెంబ్లీ సమావేశాలలో అంబేద్కర్ స్పష్టం చేశాడు.**

నాటి అసెంబ్లీ సమావేశం యుద్ధప్రతిపాదనకు విముఖత వ్యక్తం చేసింది. స్పష్టమైన హామీ లేకుండా యుద్ధప్రతిపాదనను ఒప్పుకునేది లేదంటూ గాంధీ భీష్మించుకుని కూర్చున్నా, గాంధీ అభిప్రాయంతో నిమిత్తం లేకుండా కొందరు కాంగ్రెస్ పెద్దలు బ్రిటన్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉంటే దేశవిభజన అంశం అంబేద్కర్ ఎప్పుడూ ఇష్టపడలేదు. అయితే మారుతున్న పరిస్థితులు ప్రాంతాలవారీగా ప్రజల ప్రవర్తనలో వస్తున్న మార్పులు గమనించినపుడు మాత్రం మహమ్మదీయుల భావనలను గౌరవించవలసి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**నిత్యసంఘర్షణా వాతావరణంలో కలసి ఉండడం కంటే రెండు వేరు వేరు భాగాలుగా విడిపోయి మంచి మిత్రులుగా మెలగడం మంచిదంటూ 'థాట్స్ ఆన్ పాకిస్థాన్' అనే పుస్తకంలో అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు.**

## దళితుల కోసం కాంగ్రెస్‌తో కలిసి...

ఒకవైపు దళితనాయకుడిగా, మరో వైపు లేబర్ పార్టీ అధ్యక్షుడిగా రెండు విభిన్న పదవులకు ఏకకాలంలో న్యాయం చేస్తూ తన న్యాయవాదవృత్తిని సైతం సమర్థవంతంగా నిర్వహిస్తున్న అంబేద్కర్ దళితుల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం స్పష్టమైన మార్గాన్ని ఎంచుకోవాలని భావించాడు.

విభజించి పాలించడంలో అత్యంత చతురులైన బ్రిటీష్ వారినుంచి స్వరాజ్యన్ని సాధించాలంటే అందరొక్కటై పోరాడాలని కాంగ్రెస్ భావించింది. ఈ మహా ప్రయాణంలో అంబేద్కర్ వంటి జననేత సహకారం స్వేచ్ఛాపోరాటానికి మరింత బలాన్నిస్తుందని భావించిన కాంగ్రెస్ అంబేద్కర్‌తో ప్రస్తావిస్తే దళితులకు అధికారంలో భాగం ఇస్తే కాంగ్రెస్‌తోబాటే తానూ స్వరాజ్యపోరాటంలో చేరతానని బదులు ఇచ్చాడాయన. దళితులను నిర్లక్ష్యం చేస్తే మాత్రం తాను సహించేది లేదని ఖండితంగా చెప్పాడు.

**దేశ స్వాతంత్ర్యపోరాటం విస్తృతంగా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో నిమ్న జాతులకు దేశ ఆర్థిక రాజకీయ సాంఘిక భాగస్వామ్యం కల్పించితీరాలని 1942 జూలై నెలలో నాగ్‌పూర్‌లో జరిగినఅఖిల భారత దళిత జాతుల మహాసభలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. నిమ్నజాతుల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్న లక్ష్యంతో 'అఖిల భారత నిమ్న జాతుల సమాఖ్య' ఏర్పాటయ్యింది. ఈ సమాఖ్య దేశవ్యాప్తంగా సభలు సమావేశాలు జరుపుతూ దళితులకు నైతిక ధైర్యాన్ని స్థైర్యాన్ని అందించేందుకు కృషి చేసింది.**

నిమ్నజాతుల సమాఖ్య వార్షిక సమావేశంలో అంబేద్కర్ మాట్లాడుతూ 'భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తే అది హిందువులు, మహమ్మదీయులు, నిమ్నజాతుల మధ్య పంచబడాలని డిమాండ్ చేశాడు.

**స్వాతంత్ర్యం రాబోతున్న ఈ తరుణంలో మన హక్కులు సౌకర్యాలు మెరుగుపరుచుకుందాం, ఇప్పుడు సాధించలేకపోతే ఇక ఎప్పటికీ సాధించలేం. అందరూ ఒక్కటై పోరాడినపుడు మాత్రమే ఇది సాధ్యమవు తుందని ఆయన చెప్పాడు.**

హిందూ మహాసభ అన్నా, కాంగ్రెస్ అన్నా తనకు విముఖత ఏమీ లేదనీ, నిమ్నజాతుల ఉన్నతికి ఇవి నిజంగా సహకరిస్తే వీటితో కలిసి పనిచేయడానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటాననీ ప్రకటించాడు. నిమ్నజాతులకు సరైన న్యాయం జరగడంలేదు కాబట్టే తాను ప్రత్యేకంగా నిలబడి పోరాటం చేయాల్సివస్తోందని ఆయన తెలిపాడు.

## వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుడుగా...

**1942 జూలైలో జరిగిన వైస్రాయ్ కౌన్సిల్లో అంబేద్కర్ సభ్యుడుగా నియమితుడయ్యాడు. ఒక నిమ్న జాతీయుడు వైస్రాయ్ కమిటీలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కావడం అనేది చరిత్రలో అదే మొదటిసారీ, చివరిసారీ కూడా!**

కౌన్సిల్ సమావేశాల్లో కేవలం నిమ్నజాతుల సమస్యలకే కాకుండా అణగారిన ప్రజల జీవనస్థితిగతులనూ, వారి సంక్షేమం కోసం అమలు చెయ్యాల్సిన పథకాలనూ ఎక్కువగా ప్రస్తావించేవాడు అంబేద్కర్. ప్రజలందరికీ సమన్యాయం ఉండాలన్నదే ఆయన ఆశ, ఆకాంక్ష! అందుకోసం నిజమైన ప్రజాప్రతినిధిగా తన పాత్ర పోషించేవాడు.

1942 జూలై నుంచి 1946 సెప్టెంబరు వరకూ వైస్రాయ్ కేబినేట్‌లో లేబర్ మెంబర్‌గా ఆయన చేసిన సేవలు ప్రజల మద్దతునే కాకుండా ప్రభుత్వ పెద్దల్నీ కూడా ఆకట్టుకున్నాయి. వైస్రాయ్ కమిటిలో దళితజాతుల ప్రభుత్వోద్యోగాల అంశంపై అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగా మిలటరీ ఉద్యోగాలలో దళితజాతులు ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం నిబంధనలు సడలించింది. అలాగే ఇతర సంస్థలలో అంతవరకూ నామకేవాస్తేగా ఉన్న ఉద్యోగావకాశాలు పెరిగాయి. అలాగే – దళిత జాతి విద్యార్థులకు సాంకేతికవిద్య పొందే అవకాశాలు మెరుగుపడ్డాయి!

వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుడుగా అంబేద్కర్ దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి కార్మికుల స్థితిగతులను ప్రత్యక్షంగా అధ్యయనం చేశాడు. ఈ క్రమంలో ఆంధ్రదేశంలో విస్తృతపర్యటన సాగించారు. ఆయన తన పర్యటనలో కార్మికులు వృత్తినైపుణ్యం పెంచుకోవాలని సూచించాడు. అదే విధంగా దళితజాతులు విద్యావకాశాలను సద్వినియోగపరచుకోవాలనీ, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించాడు.

## గ్రంథ రచన

**అంబేద్కర్ మంచి రచయిత, మంచి పరిశోధకుడు కూడా! ప్రజలజీవన స్థితిగతులే ఆయన కథావస్తువు.**

**ఇంగ్లీషులో సాగిన ఆయన రచనలలో**
**ఇంతవరకూ లభించిన గ్రంధాలు -**

ఏన్షియంట్ ఇండియన్ కామర్స్ (1915), కేస్ట్స్ ఇన్ ఇండియా దెయిర్ జెనిసిస్ మెకానిజం అండ్ డెవలప్‌మెంట్(1917), ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొడిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా(1925), ది ప్రాబ్లం ఆఫ్ ఎరూపీ(1923), ప్రొడిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా(1923), ఫైనాన్షియల్ హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా (ఇది అసంపూర్తి గ్రంథం), ఏన్హిలేషన్ ఆఫ్ కాస్ట్ (1936), థాట్స్ ఆన్ పాకస్థాన్ (1940), వాట్ హిందూస్ హావ్ డన్ టు ద అన్‌టచబుల్స్ (ఇది అసంపూర్తి గ్రంథం), గాంధీ అండ్ ద ఎమానిసిపేషన్ ఆఫ్ అన్‌టచబుల్స్(1946), వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హేవ్ డన్ టు ద అన్‌టచబుల్స్ (1945), రెనడే గాంధీ అండ్ జిన్నా (1943), హూ వర్ శూద్రాస్ (1946), స్టేట్స్ అండ్ మైనారిటీస్ (1947), ది అన్‌టచబుల్స్ (1948), ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందూ ఉమన్ (1951), ఫెడరేషన్ వర్సెస్ ఫ్రీడమ్, థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్, మహారాష్ట్రా యాజ్ ఎ లింగ్విస్టిక్ స్టేట్, డాక్టర్ అంబేద్కర్ ఆన్ పార్లమెంటరీ డెమోక్రసీ (1952), కమ్యూనల్ డెడ్ లాక్ అండ్ ఎ వే టు సాల్వ్ ఇట్, ది బుద్ధా అండ్ కారల్ మార్క్స్, ద బుద్ధా అండ్ హిజ్ దమ్మా, రిడిల్స్ ఇన్ హిందూయిజం, రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ ఇన్ ఇండియా - ముఖ్యమైనవి.

**ఇవి కాకుండా -**
**ఆయన ప్రసంగ పాఠాలు, విమర్శలు కూడా**
**అనంతరకాలంలో పుస్తకరూపంలో వచ్చాయి.**

## పత్రికారచయితగా...

**అంబేద్కర్ రాజకీయ నాయకుడుగా, దళిత నేతగా మాత్రమే చాలా మందికి తెలుసు. ఆయన మంచి సంపాదకుడు కూడా!**

సామాజిక రాజకీయ చైతన్యానికి పత్రికలు కూడా గణనీయమైన పాత్ర పోషిస్తాయన్న సత్యం తెలిపిన అంబేద్కర్ స్వతంత్రంగా కొన్ని పత్రికలు నిర్వహిస్తే,

మరికొన్ని పత్రికలు అంబేద్కర్ బాటనూ, మాటనూ విస్తృతంగా ప్రచారంచేశాయి! అలాంటి పత్రికల్లో – మూక్ నాయక్, బహిష్కృత్ భారత్, సమత, జనత, పీపుల్స్ హెరాల్డ్, ప్రబుద్ధ భారత్ ముఖ్యమైనవి.

## యుద్ధం ముగిసింది

**రెండో ప్రపంచయుద్ధం ముగిసింది. యుద్ధవాతావరణం నుంచి ప్రపంచ దేశాలు కొద్దికొద్దిగా తెరిపినపడి యధాస్థితికి వస్తూండగా, భారత భూభాగం ఎన్నికల యుద్ధానికి సిద్ధమయ్యింది!**

భారత్‌లో ఎన్నికలు జరుపుతామని లార్డ్ వేవెల్ 1945 జూలైలో ప్రకటించడంతో అన్నిపార్టీలూ ఎన్నికలపోరుకు రంగం సిద్ధం చేసుకోవడం ప్రారంభించగా నిమ్నజాతుల సమాఖ్య మాత్రం తగినంత ఆర్థికస్థోమత లేకపోవడంతో ఎన్నికల విషయంలో ఎటువంటి ఉత్సాహమూ ప్రదర్శించలేదు. అయితే –

**రాజ్యాంగం తయారు చేసే కమిటీని అసెంబ్లీలో ఎన్నుకోవలసి ఉంటుందన్న కారణంతో–తప్పని పరిస్థితులలో నిమ్నజాతుల సమాఖ్య ఎన్నికల ప్రచారం ప్రారంభించింది.**

దళితజాతులను ఎన్నికలకు సిద్ధంచెయ్యడానికీ, తద్వారా స్వయం నిర్ణయాధికారం, రాజ్యాధికారంలో ప్రాధాన్యత, ఆర్థిక సాంఘిక రాజకీయ రంగాలలో పురోభివృద్ధికీ నడుంబిగించిన అంబేద్కర్ దేశం నాలుగు చెరుగులా విస్తృతంగా పర్యటించారు.

ఎన్నికలు జరిగాయి! అగ్రవర్ణాల ఆర్థిక బలం ముందు నిమ్నజాతుల అభ్యర్థులు పరాజయం పాలయ్యారు!

**ఈ ఎన్నికలలో వెల్లువెత్తిన దేశస్వాతంత్ర్యేచ్ఛను గమనించిన బ్రిటీష్ ప్రధాని అట్లీ బ్రిటీష్ కామన్‌వెల్త్ రాజ్యాంగరీత్యాగానీ, లేదా మరో ఇతర ప్రక్రియ ద్వారాగాని భారతదేశం స్వతంత్ర ప్రతిపత్తిని పొందగలదని ప్రకటించాడు. ఈ మేరకు 1946 మే 6న రాజపత్రం విడుదల అయ్యింది.**

ఈ పత్రంలో మధ్యంతర ప్రభుత్వప్రస్తావనే తప్ప నిమ్న జాతుల ప్రస్తావన లేకపోవడం దళితజాతులకు ఆశాభంగాన్నీ, ఆగ్రహాన్నీ తెప్పించింది. ఆ ఆగ్రహం సత్యాగ్రహంగా రూపుదాల్చింది.

## నిమ్న జాతుల సత్యాగ్రహం

**బ్రిటీష్ ప్రభుత్వం నిమ్న జాతులపట్ల చూపుతున్న నిర్లిప్త నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షలు ఊరేగింపులూ చేపట్టారు. 'స్వతంత్ర భారతదేశంలో మాహక్కులేమిటి?' అన్న ప్లేకార్డ్లలతో నల్లజెండాలు చేతబూని వేలాది నిమ్నజాతీయులు భారీప్రదర్శనలు నిర్వహించారు.**

ఇది గిట్టని కొందరు పెద్దల ప్రోత్సాహంతో అగ్రవర్ణనేతలు సత్యాగ్రహదీక్షను విమర్శించడం ప్రారంభించాడు. ఇందుకు అంబేద్కర్ చాలా ఘాటుగా బదులిచ్చాడు.

**భావిభారత రాజ్యాంగంలో ఆరుకోట్ల మంది నిమ్నజాతీయులకు ఉన్న హక్కులేమిటి? స్వేచ్ఛాజీవనానికి వారికుండే అవకాశాలేమిటీ అంటూ ప్రశ్నించాడు. సత్యాగ్రహనినాదం ప్రభుత్వాన్ని అడకత్తెరలో పెట్టేస్తోంది.**

ఈ వివాదం ఇలా కొనసాగుతుండగానే – దేశంలో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. 1946 ఆగస్ట్ 23న కాంగ్రెస్ మంత్రివర్గం జాబితా విడుదల య్యింది. అదే సంవత్సరం డిసెంబర్లో డా. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్ సమావేశమయ్యింది. సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ సంపూర్ణ స్వరాజ్యమే భారతదేశపు లక్ష్యంగా ప్రకటించాడు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదం కోసం ప్రతిపాదించగా ముస్లిమ్‌లీగ్, ఇతర సంస్థానాధిపతులు ఈ పరిషత్‌లో ఇంకా చేరలేదు. కాబట్టి తీర్మాన ఆమోదఅంశాన్ని వాయిదా వెయ్యాలన్న అభిప్రాయం వ్యక్తమయ్యింది. సభలో గందరగోళం మొదలయ్యింది. సరిగ్గా అదే సమయంలో సభాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అంబేద్కర్‌ను ప్రసంగించవలసినదిగా కోరాడు. అంబేద్కర్ అంటే ఇష్టపడని కొందరు కాంగ్రెస్ పెద్దలు అంబేద్కర్ మొదట మాట్లాడడానికి ఇష్టపడక పోయినా, ఆయన ప్రసంగం ప్రారంభించాక ఆసాంతం ఆసక్తితో విన్నారు. అంతకు ముందు నెహ్రూ ప్రస్తావించిన అంశాలనే మరింత సోదాహరణంగా అంబేద్కర్ విశ్లేషించాడు. అందులోని లోటుపాట్లను ఆయన సున్నితంగా ప్రస్తావిస్తూ –

**'మనలో మనకు ఎన్ని విభేదాలు ఉన్నా సంయమనంగా ఉండడం ద్వారా మనం అంతా కలసి ఒకే దేశంగా ఉండటం ఆచరణ సాధ్యమే అవుతుంది. తీర్మానం ఆమోదించే అధికారం ఈ సభకు ఉన్నప్పటికీ – ఆమోదించేముందు ఈ తీర్మానం ఆమోదించడం**

**మంచిదేనా? అని ఒక్కసారి ఆలోచించడం మంచిది. మహమ్మదీయులు మనకు శత్రువులు కారు. వారినీ కలుపుకుని సమైక్యభారత ఏర్పటుకు మరో సారి ప్రయత్నించడం మంచిదని నా అభిప్రాయం. ముస్లిమ్ సోదరులు లేకుండా సభ తీర్మానాన్ని ఆమోదించడం సమంజసం కాదినిపిస్తోంది. మీరూ ఆలోచించండి'**

–అంటూ సాగిన అంబేద్కర్ ప్రసంగం సభికులలో కొత్త ఆలోచనకు తెరతీసింది. తీర్మాన ఆమోద ప్రక్రియ వాయిదాపడింది.

## అ'ఖండ' భారతం

**భరతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చేందుకు బ్రిటీష్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేసింది. అయితే – ముస్లిమ్‌ల కోర్కెను మన్నిస్తూ, దేశాన్ని రెండు ఖండాలు(భాగాలు)గా విభజించి ఇచ్చింది.**

మిగిలిన అన్ని విషయాల గురించి సభలో చర్చ జరుగుతున్నా... నిమ్నజాతుల గురించి ఎటువంటి ప్రస్తావనా లేకపోవడం అంబేద్కర్ ఆగ్రహానికి కారణమయ్యింది. దళితుల విషయం చెప్పమంటూ సభలో ప్రశ్నల బాణాలు సంధించాడు. సభలో ఏ అంశం చర్చకు వచ్చినా.. ఏదో సందర్భంలో దళితుల ప్రస్తావన తీసుకువచ్చి.. 'మా సంగతేంట'ంటూ ప్రశ్నిస్తూండటం ఓ ప్రధాన కార్యక్రమంగా చేపట్టాడు.

**దళితుల అంశంపై ప్రకటన చెయ్యక తప్పని పరిస్థితుల్లో 1947 ఏప్రిల్ 29న – 'అంటరానితనం ఏ విధంగానైనా సరే నేరమే అవుతుందంటూ' కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది.**

ఇంతటి విజయానికి కారణమైన అంబేద్కర్‌ను తెరచాటుకు నెట్టి, ఈ విజయానికి కాంగ్రెస్సే కారణమంటూ ప్రపంచదేశాలు, దేశవిదేశాల పత్రికలు ప్రశంసలు కురిపించాయి. పేరెవరికి వచ్చినా మన కృషి ఫలించిందంటూ అంబేద్కర్‌తో సహా దళితనాయకులు సంతోషపడ్డారు.

## విభజనపర్వం

**దేశం సమైక్యంగా ఉండాలంటూ ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా విభజన అనివార్యమయ్యింది. దేశంరెండుముక్కలయ్యింది. స్వతంత్రభారతంలోతాము కలిసేది లేదంటూ హైదరాబాద్, తిరువాన్కూరు సంస్థానాలు భీష్మించుకు కూర్చున్నాయి! తాము స్వతంత్రదేశాలమంటూ చెప్పుకోజూశాయి!**

ఆ సంస్థానాలకు స్వతంత్రపతిపత్తి సాధ్యం కాదనీ, వాటికి ఐక్యరాజ్యసమితి గుర్తింపు లభించదని న్యాయశాస్త్ర కోవిదుడైన అంబేద్కర్ స్పష్టంచేశాడు. భారతభూభాగంలో వేర్వేరు దేశాల ఏర్పాటు కుదరని విషయంగా ఆయన పేర్కొన్నాడు. జాతీయజెండా ఎంపికకమిటీ అశోకచక్రం ఉన్న త్రివర్ణ పతాకాన్ని జాతీయపతాకంగా ఎంపికచేసింది. సరిహద్దుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అంబేద్కర్ సూచించి నప్పటికీ సమయాభావం వల్లనో, మరేతర కారణం వల్లనో నిర్ణయాలు త్వరత్వరగా జరిగిపోయాయి. దేశవిభజన జరిగిన సందర్భంలో దేశం అల్లకల్లోలమయ్యింది. ఎక్కడ చూసినా హత్యలు, మానభంగాలు...! దేశంలో నెలకొన్న మారణహోమాన్ని ఆపడానికి గాంధీ నిరశనదీక్ష చేబట్టాడు.

పాకిస్తాన్‌లో ఉన్న హిందువులు ముఖ్యంగా నిమ్నజాతీయులు బలవంతంగా మతమార్పిడికి సమ్మతిస్తున్న విషయం తెలిసి అంబేద్కర్ చాలాబాధపడ్డాడు. పాకిస్తాన్‌లో చిక్కుకుపోయిన నిమ్నజాతులవారు ఎటువంటి సంకోచమూ పెట్టుకోకుండా తక్షణమే భారతదేశం రావల్సిందిగా అంబేద్కర్ విజ్ఞప్తి చేశాడు. వారు మతమార్పిడికి గురైనా చింతించవలసినవసరం లేదనీ, వారందరినీ హిందూమతంలోకి జేర్చే బాధ్యతను తాను స్వీకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**హిందువులతో తనకెన్ని అభిప్రాయబేధాలు ఉన్నా హిందూజాతి ఐక్యంగా ఉండాలన్నదే అంబేద్కర్ అభిమతం. హిందువుల పట్ల ఉదారంగా వ్యవహరిస్తున్న అంబేద్కర్ వ్యవహారశైలి హిందూ ప్రముఖుల్ని సైతం విస్మయ పరచింది.**

అంబేద్కర్ పిలుపుకు స్పందించి కొంతమంది నిమ్నజాతీయులు భారతదేశానికి రాగలిగారు. అయితే చాలా మంది అలా రావడానికి వీలులేని విపత్కర పరిస్థితుల మధ్య పాకిస్తాన్ లోనే ఉండిపోవలసి వచ్చింది.

## గాంధీ మరణం

**అంబేద్కర్‌కీ గాంధీకీ మధ్య అభిప్రాయబేధాలెన్ని ఉన్నా అంబేద్కర్ ఆలోచన తీరు అంటే గాంధీ ఇష్టపడేవాడు. అందుకే - ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకుంటే మంచిదంటూ నెహ్రూకి సూచించాడు.**

గాంధీ వ్యవహారశైలిలో ద్వంద్వవైఖరి ఉంటుందన్నది అంబేద్కర్‌కు అనేకసార్లు అనుభవంలోకి వచ్చింది. ఆయన చేతల్లోని లోపాలు కనిపించినప్పుడు నిర్మొహమాటంగా విమర్శించడం మినహా ఆయనంటే వ్యక్తిగతంగా ఎటువంటి విమర్శా చేసేవాడుకాదు. అందుకే 1948 జనవరి 30న సాధూరాం గాడ్సే జరిపిన కాల్పుల్లో అకాల మృత్యువాత పడిన గాంధీ మృతదేహాన్ని చూసిన అంబేద్కర్ కొద్దిసేపు మాటలు రాని బొమ్మలా మారిపోయాడు.

## తొలి న్యాయమంత్రి

**బ్రిటిష్ పార్లమెంటు భారతదేశ స్వాతంత్ర్యచట్టాన్ని 1945 జూలై 15న ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం అసెంబ్లీకి సర్వాధికారాలు సంక్రమించాయి. బెంగాలు విభజనతో అంబేద్కర్ సభ్యత్వం పోయింది. ఆ స్థానంలో కాంగ్రెస్ వారు అంబేద్కర్‌ను ఎన్నుకున్నారు. ఆయనకు సమ్మతమైతే న్యాయశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టమంటూ ఆహ్వానించారు.**

భారతీయ ప్రజలందరికీ సమన్వయం వర్తింపజేసే ఈ అవకాశం శుభ పరిణామంగా భావించిన అంబేద్కర్ న్యాయశాఖామాత్యులుగా బాధ్యతలు చేపట్టారు.


ఆసియా ఖండంలో స్వతంత్ర ప్రతిపత్తి గల అతిపెద్ద దేశంగా 1947 ఆగస్ట్ 15న స్వతంత్ర భారతదేశం ఆవిర్భవించింది. న్యాయశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే మధ్యపరగణాలలో నిమ్నజాతుల సమాఖ్య కార్యకర్తల్ని అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా పరుషంగా వ్యాఖ్యానించాడన్న కారణంతో చెలరేగిన వివాదం చాలా కాలానికి గానీ చల్లారలేరు.



Dr. Ambedkar with his devoated colleagues of the People's Education Society, Bombay. ( July 1945 )



Dr.Ambedkar in Constituents Assembly. On his left are Shri.Antony, Sardar Vallabhbhai Patel and B.G.Kher. (1947)



Dr.Ambedkar Chairman, Drafting Committee of Indian Constitution with other members. (Sitting fromleft) Shri.N.Madhavrao, Sayyad Sadulla, Dr.Ambedkar (Chair-man), Alladi Krishnaswamy Iyer, Sir Benegal, Narsingh Rao. Standing from left - Shri.S.N. Mukharjee, Jugal Kishor Khanna and Kewal Krishnan. (Aug29, 1947)



Raobahadur C.K.Bole and other workers meet Dr.Ambedkar at the Bombay Airport. The group requested Dr.Ambedkar to adopt the saffron colour flag as the National Flag - Bombay, July 10, 1947.



Dr.Ambedkar & Shakarrao Dev, members of Congress Working Committee at Birla House, New Delhi where Gandhiji's dead body was kept for Darshan on Jan.30, 1948.



Dr.Ambedkar being administeared the Oath by the first President of Indian Republic Dr.Rajendra Prasad. Jawahar Lal Nehru the then Prime Minister of India, looking on. (1947)



Dr.Ambedkar, Chairman Drafting Committee Presenting the draft of the Constitution to Dr.Rajendra Prasad, President Constituents Assembly. (Feb.1948)




Dr.Ambedkar married Dr.Sharada Kabir at his residence , Hardings Avenue,New Delhi on 15th April, 1948. Prior to the marriage she was the doctor attending Dr.Ambedkar during hiw illness in Bombay.




Dr.Ambedkar, Dr.Smt.Ambedkar with the first Indian Governor General C.Rajagopalchari and his family members at Rashtrapati Bhavan, New Delhi on July 28, 1948.



Karmveer Bhaurao Patil, Karmayogi Sant Gadgebaba and Dr.B.R.Ambedkar - Trustee of Sant Chokhamela Dharmashala, Pandharpur. Gadgebaba dedicated this Dharmashala to Dr.B.R.Ambedkar. ( 1949 )



Dr.Ambedkar, Law Minister & Dr.Rajendra Prasad, President of India in the famous Kailas Cave, Ellora on September 2, 1950.



Foundation stone of new college at Aurangabad (named after Milind) was laid on Sept,1,1950 by Dr.Rajendra Prasad, President of India. Dr.Ambedkar & Dr.Mrs.Ambedkar are seen.

## రాజ్యాంగరచన

**స్వతంత్ర భారతదేశ రాజ్యాంగ రచన కోసం ఏర్పాటైన కమిటీకి అంబేద్కర్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, గోపాలస్వామి అయ్యర్, కె.ఎం.మున్షీ, సయ్యద్ మహమ్మద్ సాదుల్లా, బి.ఎల్.మిత్రా, డి.పి.షేత్నాలు మిగిలిన సభ్యులు. నూతన రాజ్యాంగరచనా ప్రక్రియ ప్రారంభమయ్యింది.**

న్యాయశాఖామంత్రిగా, రాజ్యాంగరచనా సంఘ అధ్యక్షుడుగా ఎంత పనిఒత్తిడిలో ఉన్నా తనను కలుసుకునేందుకు వచ్చిన దళితజాతులను ఆదరంగా పలకరించి, పరామర్శించి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసేవాడు.

**'పట్టు వదలక ప్రయత్నించినప్పుడు మాత్రమే విజయం మనస్వంతమవుతుంది. మంచి ఆలోచనాశక్తితో బాటు, మనం నేర్చుకున్నదానిని తిరిగి చెప్పగల వాగ్ధాటి చాలా అవసరం అంటూ ఆయన విద్యార్థులకు హితవు చెప్పేవాడు.**

కేంద్రమంత్రివర్గబాధ్యతలతో తానెంత తీరిక లేకుండా ఉన్నా రాజ్యాంగ రచనా ప్రక్రియ పట్ల ఆయన అలక్ష్యం చెయ్యలేదు. నిద్రాహారాలు మాని క్లాజులూ, సబ్ క్లాజులు... అంటూ న్యాయశాస్త్ర గ్రంధాలలోని ముఖ్యాంశాలను ఉటంకిస్తూ అన్ని వర్గాలకూ, అన్ని కులాలకూ, అన్ని మతాలకూ సమన్యాయం జరిగే విధంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నారాయన. 1948 ఫిబ్రవరి నెలలో 315 అధికరణాలు, 8 షెడ్యూళ్ళతో రాజ్యాంగం చిత్తుప్రతి పూర్తిచేసి రాజ్యాంగపరిషత్‌కు అందించారు. వివిధ దశలుగా జరిగిన కూలంకశ చర్చలో అన్ని వర్గాలకూ సమన్యాయం జరుగు తోందన్న సంతృప్తిని సభ్యులు వ్యక్తంచేశారు. చర్చలు, సవరణలు, మళ్ళీ చర్చలు, మళ్ళీ సవరణలు – ఇలా – సుమారు 23నెలలపాటు సుదీర్ఘంగా చర్చించిన పిమ్మట మొత్తం 3,749 సవరణలలో 2,473సవరణలు ఆమోదిస్తూ తీర్మానించాయి. 1949 నవంబరు 26నుంచి ఈ రాజ్యంగం అమలులోకి వచ్చింది.

## రెండో వివాహం

**వివిధ బాధ్యతలను ఏకకాలంలో నిర్వహిస్తూ కాలంతో పరిగెత్తిన అంబేద్కర్ ఆరోగ్యం కొద్ది కొద్దిగా క్షీణించడం ప్రారంభించింది.**

**ఎన్నిమందులు వాడినా ఫలితం ఉండేది కాదు.**

**ఇదే సమయంలో డా.శారదాకబీర్‌తో పరిచయం, ఆ పరిచయం పరస్పర అభిమానంగా మారి వివాహానికి దారితీసింది.**

ఈ సమయంలో వివాహం చేసుకోవడం ఎంతవరకూ సబబు అంటూ సన్నిహిత మిత్రులతో సంప్రదించిన పిమ్మట, అందరి అనుమతితో – కొంతమంది మిత్రుల సమక్షంలో 1948 ఏప్రిల్ 15న వివాహం చేసుకున్నాడు.

## బౌద్ధమతం పట్ల ఆసక్తి

**ఇతర మతప్రవక్తల్లా తాను దైవాంశసంభూతుడుగా బుద్ధుడు ఎప్పుడూ ఎక్కడా చెప్పలేదు... ఆ విధంగా ప్రవర్తించనూ లేదు...! అందుకే బుద్ధుడి గురించీ, బౌద్ధమతం గురించీ తెలుసుకోవాలన్న ఉత్సాహం అంబేద్కర్‌కు కలిగింది.**

సత్యం, ధర్మం, సన్మార్గం చూపిన వ్యక్తిత్వం బుద్ధునిది కావడంతో బుద్ధ చరిత్ర బౌద్ధమతధర్మాలను అధ్యయనం చెయ్యడం ప్రారంభించాడు. హిందూమతంలో దేవునికి ఉన్నస్థానం బౌద్ధమతంలో ధర్మానికి ఉండడం ఆయన్ను ఆకట్టుకుంది.

బౌద్ధమతం గురించి తెలుసుకోవాలన్న ఆయన ఆసక్తి వివిధ దేశాలలో జరుగుతున్న బౌద్ధమత సమావేశాలకు ఆయన్ను హాజరయ్యేలా చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయన కొలంబో, నేపాల్, రంగూన్ తదితర దేశాల్లో పర్యటించారు.

హిందూన్యాయ శాస్త్రానికి సవరణలు చేసి సమకాలీన సమాజానికి అనుగుణంగా రూపొందించాలన్న లక్ష్యంతో 1941 నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పట్లోనే హిందూకోడ్ బిల్లు కమిటీ ఏర్పాటయ్యింది కూడా!

**ఈ బిల్లు సవరణలపై దృష్టి పెట్టిన అంబేద్కర్ – సంప్రదాయాలను గౌరవిస్తూనే, ఆ అంశాలను ప్రస్తుత సమాజానికి వర్తించే విధంగా మార్పులు చెయ్యాలన్నది ఆయన ఆశయం. ఈ బిల్లును అంబేద్కర్ పరిశీలిస్తున్నాడనే వార్త ఘుప్పుమనడంతో దేశమంతటా ఒకటేచర్చ. ప్రజలంతా రెండువర్గాలుగా చీలిపోయి సమావేశాలు, చర్చలు ప్రారంభించారు.**

ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా హిందూ సమాజపు నిబంధనలను కొంతసడలిస్తూ బిల్లు తయారుచేశారు. 1951 ఫిబ్రవరిలో అంబేద్కర్ హిందూకోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాడు.

మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకూ ఆస్తిహక్కు, స్త్రీలకుదత్తు ఇచ్చే, పుచ్చుకునే హక్కు, దత్తకుమారుడికి సగం ఆస్తిహక్కు, పునర్వివాహం చేసుకున్న స్త్రీ వారసత్వపు హక్కు కోల్పోవడం, వివాహ విషయంలో స్వేచ్ఛ, బహుభార్యాత్వం రద్దు, వివాహాన్ని విడాకుల ద్వారా మాత్రమే రద్దుచేసుకోవచ్చునన్న నిబంధన, వివాహంలాగే దత్తును కూడా ఏ వర్గం నుంచైనా చేసుకునే సదుపాయం, కుటుంబంలోని సభ్యులందరికీ ఆస్తిలో భాగం – ఇలా కొన్ని నిబంధనలు సడలిస్తూ, మరికొన్ని నిబంధనలను విధిస్తూ హిందూకోడ్ బిల్లు తయారయ్యింది. ఈ బిల్లుపై సుమారు ఆర్నెల్లకు పైగా సుదీర్ఘ చర్చ జరిగింది. 1951 సెప్టెంబరులో బిల్లులోని కొన్ని అంశాలు మాత్రం పార్లమెంటు ఆమోదం పొందింది.

**తాను ఎంతో శ్రమకోర్చి తయారు చేసిన హిందూకోడ్ బిల్లు ముక్కముక్కలై సభ ఆమోదం పొందడం అంబేద్కర్‌ను చాలా బాధించింది. ఫలితంగా – తన మంత్రి పదవికి ఆయన రాజీనామా చేస్తూ – తానంతకుముందు ప్రవేశపెట్టిన బిల్లులు, ప్రతిపాదనల విషయంలో సహకరించగలరని పేర్కొన్నాడు.**

మంత్రి పదవికి రాజీనామా చేసిన ఆయన ఆ మర్నాటినుంచీ ప్రతిపక్ష సభ్యుడిగా పార్లమెంటులో బృహత్తర బాధ్యతల నిర్వహణకు సమాయత్తమయ్యాడు.

## సునిశిత విమర్శలు

**ప్రతిపక్ష నాయకుడుగా అంబేద్కర్ సేవలు అపూర్వమైనవి. అంతకు ముందు కాంగ్రెస్ చేసిన నిర్ణయాలను సున్నితంగా విమర్శించే అంబేద్కర్ ప్రతిపక్షనాయకుడిగా నిర్మొహమాటంగా ఎండకట్టడం ప్రారంభించాడు.**

అంబేద్కర్ వాగ్ధాటికీ, ఆయనలోతైన విమర్శకూ కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో ఆచితూచి వ్యవహరించాల్సివచ్చేది. ఇదిలా ఉండగా – కొలంబియా విశ్వవిద్యాలయం అంబేద్కర్‌కు 'డాక్టర్ ఆఫ్ లాస్' గౌరవ డిగ్రీ ప్రకటించింది. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్న పదానికి ఇదే నిజమైన ఉదాహరణగా అంబేద్కర్ మిత్రులు ఆనందం వ్యక్తంచేశారు.

## ఒకే భాష

**దేశ సమైక్యత సమగ్రతల దృష్ట్యా దేశమంతటా ఒకే భాషగా హిందీ, ఒకే లిపిగా దేవనాగరి ఉండాలన్నది అంబేద్కర్ అభిమతం.**

అయితే భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అంశం దేశమంతటా చర్చనీయాంశం కావడంతో ఆయన తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతూ, 'నా మటుకు నాకు మరాఠీ ముఖ్య భాషగా గల రాష్ట్రాలు రెండుంటే బాగుండనిపిస్తుంది. కానీ దేశ శ్రేయస్సు దృష్ట్యా అది మంచిది కాదు. అలాగే ఆంధ్రరాష్ట్రం విషయంలో కూడా! ఏదిఏమైనా ఈ విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవడం మంచిదంటూ సూచించాడు.

## మహిళాభ్యున్నతి

**భారతీయ స్త్రీలు అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో కుటుంబవ్యవస్థలో స్త్రీలను కొన్ని హక్కులు కల్పిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన హిందూకోడ్ బిల్లు పార్లమెంటులో ఆమోదం కాకపోవడం పట్లఅంబేద్కర్ చాలా బాధపడేవాడు.**

భార్య భర్తకు బానిసగా కాకుండా సహచారిగా ఉండాలన్న తన ఆకాంక్ష నెరవేరే మంచి రోజులు రావాలని ఆయన కలలు కనేవాడు. స్త్రీలు విద్యావకశాలు అందిపుచ్చుకుని ఉన్నత విద్యావకాశాలు, మెరుగైన జీవన స్థితిగతులు పొందాలని ఆయన సూచించేవారు.

## వయసు మీద పడింది

**వయసు మీద పడుతున్నా మనసు మాత్రం ఇంకా ఏదో చేయ్యాలి, నాజాతి జనులు తల ఎత్తుకుని సంఘంలో గౌరవంగా బతకాలంటూ అంబేద్కర్ తహతహలాడేవారు.**

కంటిచూపు మందగించడం, కాళ్ళకు నరాలబలహీనత ఆవహించడం, చక్కెరవ్యాధి ఇబ్బందిపెట్టడం – ఫలితంగా మరో మనిషి సాయం లేకుండా నడిచే

అవకాశానికి కూడా దూరమయ్యాడు. ఏ సౌకర్యలకూ నోచుకోకుండా గ్రామసీమల్లో జీవిస్తున్న గ్రామీణ నిమ్నజాతులకు తగినంత సేవచెయ్యలేకపోయానే అని ఎప్పుడూ బాధపడేవారు.

## బౌద్ధమతం

**ఎన్నిపనుల్లో తానున్నా, ఇప్పుడు వయసు, ఆరోగ్యం సహకరించకున్నా అంబేద్కర్ మనసు బౌద్ధమతంవైపు ఆకర్షింపబడింది. 1954 డిసెంబర్‌లో రంగూన్‌లో జరిగిన ప్రపంచ బౌద్ధమహాసభలకు భార్య తోడుగా మరో సేవకుడి సహాయంతో రంగూన్ వెళ్ళారు.**

భవిష్యత్‌లో భారతదేశంలో బౌద్ధమత వ్యాప్తికి తాను తప్పక సహకరించగలనని ఆయన ప్రకటించాడు. రంగూన్ సభల్లో ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొన్న భారత్ చేరిన తర్వాత సామాన్యలకు సైతం బుద్దుని బోధనలు చేరువయ్యేలా ప్రత్యేకంగా గ్రంధరచన ప్రారంభించాడు. పెరిగిన వయసు సహకరించకపోవడంతో రచనాప్రక్రియ నెమ్మదిగా సాగింది. 1956లో గ్రంథం పూర్తయ్యింది. బౌద్ధమతం స్వీకరించాలన్న అంబేద్కర్ నిర్ణయం దృఢమయ్యింది.

**1956 అక్టోబరు14న మత స్వీకరానికి ముహూర్తంగా నాగ్‌పూర్ వేదికగా నిర్ణయం జరిగింది. సమయం రానే వచ్చింది. అక్టోబర్ 14వతేదీ ఉదయం అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించారు.**

నాగ్‌పూర్‌లో బౌద్ధమతం స్వీకరించిన అనంతరం నవంబరులో ఖాట్మండులో జరిగిన ప్రపంచ బౌద్ధుల నాల్గవసమావేశాలకు ప్రత్యేక అతిథిగా అంబేద్కర్ హాజరయ్యాడు. సభలో బుద్ధుడు - కారల్ మార్క్స్ అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశాడు. కొద్ది రోజులు అక్కడే విశ్రాంతి తీసుకుని తిరిగి భారత్‌కు పయనమయ్యాడు.

## మహానిర్యాణం

**ఖాట్మండు నుంచి తిరిగివచ్చిన అంబేద్కర్‌ను అనారోగ్యం మరింత ఇబ్బంది పెట్టింది. కొద్దిపాటి విశ్రాంతి అనంతరం నెమ్మదించడంతో తిరిగి తన పనులను ఉత్సాహంగా చేసుకోవడం ప్రారంభించాడు.**


1956 డిసెంబర్ 6వ తేదీ ఉదయం నిద్రిస్తున్న సమయంలోనే అంతిమశ్వాస విడిచాడు. క్షణాలలో ఈ వార్త దేశమంతటా వ్యాపించింది. అభిమానులు, మిత్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. భౌతిక కాయాన్ని ప్రత్యేక విమానంలో బొంబాయి తరలించారు. లక్షలాదిమంది అభిమనులు నివాళులు అర్పిస్తుండగా బొంబాయి నగరవీధుల్లో అంతిమయాత్ర సాగింది.

ప్రజల కోసం అహరహం పరితపించే నిజమైన ప్రజానాయకుడు ఇకలేరన్న వార్త యావద్దేశాన్ని దుఃఖ సాగరంలో ముంచివేసింది.

**ఏ సౌకర్యమూ పొందే అర్హతలేని అణగారిన కులంలో పుట్టి, అంచెలం చెలుగా ఎదిగి, యావద్దేశమూ గర్వించదగిన స్థాయికి చేరుకున్న అంబేద్కర్ జీవితం దృఢదీక్షాదక్షతలకు నిజమైన ఉదాహరణ, కృషి ఉంటే మనుషులు ఋషులవుతారన్న నానుడి అంబేద్కర్ విషయంలో అక్షరసత్యం..**

**‘పట్టు వదలక ప్రయత్నించినప్పుడు మాత్రమే**
**విజయం మనస్వంతమవుతుంది.**
**మంచి ఆలోచనాశక్తితో బాటు, మనం నేర్చుకున్నదానిని**
**తిరిగి చెప్పగల వాగ్ధాటి చాలా అవసరం’**






# డా. అంబేద్కర్ వంశవృక్షం





□□. □□□□□□□□ □□□□□□ □□□□□□□□□□
□□□□□□□ □□ □□□□□□ 1950







డా. అంబేద్కర్ స్మృత్యర్థం
భారత ప్రభుత్వం విడుదల చేసిన
పోస్టల్‌స్టాంపులు




□□□□□□□ □□□□□□□□□□ □□□□□□□□ □□ □□. □□□□□□□□ □□ □□□□□, □□□□□□, □□□□ □□□ □□□□□□ □□□□□□□ □□□□ □□□□□□□□□ □□ □□□□□ □□ □□□□□□□□ 7,1956




ఎడిటర్ డా. అంబేద్కర్



విమాన ప్రయాణంలో
డా. అంబేద్కర్ పత్రికా పఠనం



**Dr.Ambedkar with his wife - Dr. Savita Ambedkar, servant - Sudama and their pet dog.**



**Dr.Ambedkar & Dr.Shamprasad Mukherjee President, Bhartiya Janasangha talking on the Campus of Parliament. (1951)**



వివిధ సందర్భాలలో డా. అంబేద్కర్ హావభావాలు




డా. అంబేద్కర్ రేడియో ప్రసంగం



రాజ్యాంగ ప్రతిని అందిస్తూ...



Dr.Ambedkar sitting in his library at his residence, 26 Alipore Road, New Delhi.
Dr.Sadatissa, Buddhist Monk from Sri Lanka came to wish Dr.Ambedkar on his birthday.



Members of First Central Cabinet of Indian Republic Pandit Nehru, Prime Minister and Dr.Rajendra Prasad, President of India are sitting in the center. Dr.Ambedkar is sitting at the extreme of the first row. (Jan.1950)



Dr.Ambedkar debating with religious Scholors on Hindu Code Bill in the Parliament, New Delhi.(1951)



Dr.Ambedkar planting a Bodhi Tree in the Campus of Milind College, Aurangabad with Dr.Mrs.Ambedkar & B.H.Varale ( 1950 )



The Columbia University conferred an honorary Degree of Doctor of Laws on Dr.Ambedkar in recognition of Drafting of Indian Constitution, Social Reformer and Valiant fighter for Human Rights at the hands of General Ei-sen-hower, the President of Columbia University, New York on June 5, 1952.



Columbia University conferred the LL.D.degree on Dr.Ambedkar. The photograph while leaving Mumbai by plane on June 1, 1952.



Dr.Ambedkar performed inaugural Ceremony of "Atre Pictures." Mahatma Phule, at the famous studios in the Bombay on Sunday January 4, 1954. Acharya P..K.Atre, Dr.Ambedkar, Actor Baburao Pendharkar (Jyotiba Phule) and Sulochana (Smt.Savitribai



Dr.Ambedkar addressing the Public meeting held on Buddha Jayanti at New Delhi. The British High Commissioner (sitting) was Chief Guest.



Dr.Ambedkar addressing the World Buddhist Conference held at Rangoon (Barma). Shri.V.V.Giri Indian High Commissioner and Dr.(Smt) Ambedkar are seen. (December, 1954)



Dr.Ambedkar embraced Buddhism on October 14, 1956 at Nagpur. Bhante Chandramani administering the oath in Pali to Dr.Ambedkar & Dr.Mrs.Ambedkar Devipriya Valisinha, General Secretary, Mahabodhi Society, is seen in center.

Dr.Ambedkar delivering his historic speech "Buddha of Karl Marx" on November 20, 1956 before delegates of the 4th World Buddhist Conference held at Katmandu (Nepal). His Highness the Prince of Nepal, Dr.Mrs.Ambedkar and Bhante Chandramani are also seen.







Dr.Ambedkar accompanied by Mrs.Maisaheb Ambedkar while leaving on 15th November 1956 for conference of the Bhratru-Sangh, at Kathmandu.

On return from Kathmandu paying a visit to the Buddhist holy place, Sarnath on 24th November 1956.- Dr.Ambedkar





**Dr. Ambedkar as he passed away in his sleep at his residence at Delhi on December 6, 1956**



Prime Minister Pandit Jawaharlal Nehru came to pay homage to Dr.Ambedkar on December 6, 1956 at 26 Alipore Road, New Delhi. Dr.Ambedkar's dead body is seen.



Dr.Ambedkar died on December 6, 1956 at his residence 26 Alipore Road, New Delhi. The historic (biggest in Bombay History) funeral procession started from Rajgraha on December 7, 1956.





Dr.Ambedkar's Statue in the Campus of Parliament House, New Delhi. Dr.Ambedkar - an eternal source of inspiration to the Indian Parliament.



A Stupa situated at Chaitya Bhoomi, Dadar Choupati, Bombay where Dr.Ambedkar was cremated on December 7, 1956.



"Bharat-Ratna" India's Highest Civil Award was conferred on Dr.Ambedkar (Posthumously) on April 14, 1990. H.E. Shri.R.Venkatraman, President of India Presented "Bharat-Ratna" to Dr.Mrs.Savita Ambedkar, wife of Dr.Ambedkar at Rashtrapati Bhavan, New Delhi.

## డా॥ అంబేద్కర్ జీవితంలో ముఖ్య ఘట్టాలు

| | | |
|---|---|---|
| జననం | : | 1891, ఏప్రిల్ 14 |
| ఇంటర్ ఉత్తీర్ణత | : | 1910 |
| బి.ఏ.డిగ్రీ | : | 1912 |
| రమాబాయితో వివాహం | : | 1907 |
| ఎం.ఏ. | : | 1915 |
| బరోడాలో ఉద్యోగం | : | 1917 |
| కాలేజీ లెక్చరర్ | : | 1918 |
| విద్యాభ్యాసానికి లండన్ ప్రయాణం | : | 1920 |
| బొంబాయిలో లాయర్‌గా ప్రాక్టీస్ | : | 1923 |
| మహద్ చెరువు ఉద్యమం& | | |
| బొంబాయి శాసనమండలి సభ్యత్వం | : | 1927 |
| భార్య రమాబాయి మృతి | : | 1935 |
| వైస్రాయి కౌన్సిల్ సభ్యత్వం | : | 1942–1946వరకు |
| కేంద్ర న్యాయశాఖ మంత్రి | : | 1947,ఆగస్టు3 |
| రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షత | : | 1947, ఆగస్టు20 |
| డా॥శారదా కబీరుతో రెండవ వివాహం | : | 1948, ఏప్రిల్ |
| బౌద్ధమత దీక్ష | : | 1956, అక్టోబర్ 14 |
| మరణం | : | 1956, డిసెంబరు 6 |

# మట్టిలో మాణిక్యం

# అంబేద్కర్

(1891 - 1956)




VICTORY

విక్టరీ పబ్లిషర్స్

# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,

విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156